


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575

www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.


సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 10.02.2026 | సంపుటి : 3 | సంచిక :10 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Tuesday | 10.02.2026 | volume : 3 | Issue : 10 | Pages : 8 | Cost : 2/- |

# ప్రచారం బంద్

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం



**116 మున్సిపాలిటీలు , 7 మున్సిపల్ కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం**

**11న పోలింగ్‌కు ఎన్నికల సంఘం సర్వం ఏర్పాట్లు**

**తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రచార పర్వం ముగిసింది. చివరిరోజు ఉధృతంగా ప్రచారం సాగింది. కాంగ్రెస్ నుంచి మంత్రులు తమ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బిజెపి, బిఆర్ఎస్ నేతలు కూడా ప్రచారంలో దూసుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు , 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. అధికార , ప్రతిపక్ష పార్టీలు తమ సత్తా నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నాయి.**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 : అగ్రనేతల పర్యటనలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో ఇన్నాళ్లూ మార్మోగిన వీధులన్నీ ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో ఓటర్ల బలం గణనీయంగా ఉంది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి మొత్తం 52,43,023 మంది ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఇందులో పురుష ఓటర్ల సంఖ్య 25,62,639 కాగా, 26,80,014 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య -మిగతా 2 లో..

### 11న మున్సిపల్ పరిధిలో సెలవు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 : ఈ నెల11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికలు జరిగే కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు ఈ నెల 11న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ ఎన్నికల సంఘం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కోసం వినియోగిస్తున్న విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ 10, 11 న స్థానిక సెలవు దినంగా ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ఈ నెల 11 నుండి 13 వరకు సెలవులు ప్రకటిస్తూ జారీ చేశారు.



## 'సర్' ప్రక్రియ కొనసాగాల్సిందే..

### ఎలాంటి అడ్డంకులు కల్పించవద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : బెంగాల్‌లో నిర్వహిస్తోన్న 'సర్' కసరత్తును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటామని పేర్కొంది. అంతేకానీ సర్ ప్రక్రియలో అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. ప్రత్యేక సమగ్ర సవరణ

-మిగతా 2 లో..



## అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం

### అభివృద్ధిని చూసి ఓటేయండి

**పట్టణాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం**

**రాష్ట్రంలో అనేక పథకాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేపట్టాం**

**తెలంగాణ రూపాయి ఇస్తే.. 42 పైసలే వాపస్ వస్తున్నాయి**

**ఉత్తరాది బీహార్, యూపిలతో పోలిస్తే దారుణమైన పరిస్థితి**

**దక్షిణాది రాష్ట్రాలపై కక్షగట్టిన ప్రధాని మోడీ**

**కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నట్లు**

**సమావేశంలో గణాంకాలతో వెల్లడించిన సిఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 : మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ఓటేయాలని, దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధికి ప్రభుత్వానికి అవకాశం ఉ ంటుందని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల మోడీ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుని అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు.మున్సిపల్ ఎన్నికలకు మోడీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ముఖం చూసి ఓటేయమని బిజెపి అడగడాన్ని ఎద్దేవా చేశారు. బిజెపి అధ్యక్షుడు ప్రచారంలో

-మిగతా 2 లో..

## పాలన చేతకాక.. హామీలను అటకెక్కించారు

### రెండేళ్ల తరువాత మళ్లీ అధికారం మాదే

**హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటాం**

**భూపాలపల్లి ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్**



జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 9 : రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు భూపాలపల్లిలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. హామీలు అమలు చేయాలని

-మిగతా 2 లో..



## సీఎంల వద్దకు మేం వెళ్లం..

### రెడ్డి అయినా.. రావు అయినా మా దగ్గరికి రావాల్సిందే

**ఎంఐఎం నేత అక్బరుద్దీన్**

కరీంనగర్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. అంతకు ముందు కరీంనగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంఐఎం నేత అక్బరుద్దీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎంల దగ్గరకు తాము వెళ్లమని, వాళ్లే తమ వద్దకు వస్తారని అన్నారు. "రెడ్డి అయినా.. రావు అయినా మా దగ్గరికి రావాల్సిందే. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మా మద్దతు లేనిదే కాంగ్రెస్ గెలిచిందా? ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం బ్రదర్స్ సత్తా ఏంటో చూపిస్తాం" అని వ్యాఖ్యానించారు.

## ఆలోచించి ఓటేయాలి

### సింగరేణిని రక్షించేది బీజేపీ మాత్రమే

**సింగరేణి సంస్థ అప్పుల ఊబిలో విలవిలాడుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖనిలోని గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.**

"బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయి. రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం గత ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఇక్కడ ఎరువుల కర్మాగారం, పవర్ ప్రాజెక్టు తెచ్చింది భాజపా. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు.






### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72

## రాజకీయాలు కాదు.. అభివృద్ధి ముఖ్యం

### ఎన్నికల ప్రచార సభలో డిప్యూటీ సీఎం భట్టి



ఖమ్మం, ఫిబ్రవరి 9: మధిర పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిరలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ తరహాలో మోడరన్ మహాప్రస్థానం శ్మశానవాటిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొంది స్తున్నామని తెలిపారు. మధిరకు కావాల్సింది రాజకీయాలు

-మిగతా 2 లో..

## రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

### అందుకే ఓటుకునోటు ఫైల్లు దగ్గం

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపణ**



మెదక్, ఫిబ్రవరి 9 : ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం మెదక్‌లో హరీశ్ రావు

-మిగతా 2 లో..



## సమ్మక్క-సారక్క' హుండీల లెక్కింపు..

### ఇప్పటి వరకు రూ.11.83 కోట్ల ఆదాయం

హనుమకొండ: మేడారం సమ్మక్క-సారక్క జాతర హుండీల లెక్కింపు కొనసాగుతోంది. ఐదోరోజు ఆలయ సిబ్బంది 163 హుండీలను లెక్కించారు. వీటి ద్వారా రూ.1.12 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పటి వరకు మొత్తం 788 హుండీలను లెక్కించగా.. రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చింది. మిగిలిన హుండీల లెక్కింపునకు మరో రెండ్రోజులు పట్టవచ్చని ఆలయ సిబ్బంది తెలిపారు. నోట్ల లెక్కింపు పూర్తయ్యాక బంగారం, వెండి వస్తువుల విలువను నిర్ధరించనున్నారు.

# అభివృద్ధిని చూసి ఓటేయండి

మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నా రాష్ట్రానికి ఒక్క పైసా ఉపయోగం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా పన్నుల పునఃపంపిణీలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన గణాంకాలతో సహా ఎండగట్టారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న ప్రతి రూపాయికి ప్రతిఫలంగా రాష్ట్రానికి కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలపై గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల వాటా పంపిణీలో ఉత్తరాది రాష్ట్రాలకు అందుతున్న నిధులపై సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి నుంచి నిధులను సేకరించి, ఇతర రాష్ట్రాలకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రూపాయి పన్ను చెల్లిస్తే కేంద్రం ఆ రాష్ట్రానికి 2 రూపాయలు తిరిగి ఇస్తోందని, ఇక బీహార్ విషయానికొస్తే రూపాయికి బదులుగా ఏకంగా 6 రూపాయలు నిధులుగా వెళ్తున్నాయని ఆయన వివరించారు. ఈ స్థాయి వివక్షపై తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా పార్లమెంట్‌లో నోరు మెదిపారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు తెలంగాణకు మీరు చేసిన మేలేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పైకి విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, లోపల మాత్రం ఆ రెండు పార్టీలు ఒక్కటేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన వివాదాస్పద రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపిందని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా, నోట్ల రద్దు సమయంలో కేసీఆర్ అసెంబ్లీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మరీ ప్రధాని మోదీని అభినందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పలేదా అని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లుగా వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం బయటపడదని అనుకుంటున్నారని, కానీ బీఆర్ఎస్ , బీజేపీ మధ్య పక్కాగా 'క్విడ్ ప్రో కో' ఒప్పందం నడుస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అత్యంత ఖరీదైన ఫార్ములా-ఈ కారు రేస్ అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ ఈడీ వద్ద ఉన్నా చర్యలు



ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేసినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని అడిగారు. బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకే బీజేపీ ఈ కేసులను అటకెక్కించిందని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని, కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసాను సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న భాజపా.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు. తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని భాజపా నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు.

కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమికండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం? భాజపా నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా భాజపా రాజకీయ మనుగడ సాగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇకపోతే తెలంగాణ కోరిన మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్, మెట్రో విస్తరణ వంటి పథకాలపై ఎలాంటి కదలిక లేదన్నారు. అయితే తెలంగాణ అభివృద్ధికి తాము రెండేళ్లలో అనేక పనులు చేపట్టామని అన్నారు.



## రెండేళ్ల తరువాత మళ్లీ అధికారం మాదే

మొదటి పేజీ తరువాయి

ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మీ డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్దాలు చెప్పిండని అన్నారు. కానీ ఇప్పుడు మొఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ తెలిపారు. నువ్వు పెట్టినవా తీసేయడానికి.. రెండేళ్లలో ఈ పొట్టోడు ఏం పీకిండని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే నీ వీపు చింతపండు చేస్తారని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాను తెచ్చింది అభివృద్ధి చేసింది కేసీఆర్ అని తెలిపారు. సింగరేణి కాంట్రాక్టులను రేవంత్ రెడ్డి తన బామ్మర్దికి కట్టబెట్టిండని పేర్కొన్నారు. బొగ్గు కుంభకోణం బయటపెట్టామని ఫేక్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిప్పు పెట్టి తగులబెట్టారని మండిపడ్డారు. తెలంగాణను ఆగం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని గల్లా పట్టుకుని అడగండని ఓటర్లకు పిలుపునిచ్చారు. తులం బంగారం ఎప్పుడిస్తావని అడగాలన్నారు. రేవంత్ రెడ్డికి ఓటుతోనే కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. బూతుల ముఖ్యమంత్రికి పోలింగ్ బూత్‌లోనే బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అన్ని వార్డుల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఇదిలావుంటే అసలు కాంగ్రెస్ వాళ్లు మసకబడితే నకిలీ తెలుగుదేశపోడు ముఖ్యమంత్రి అయ్యిండని రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లిలో కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అసలైన కార్యకర్తలు, నాయకులకు విలువ లేదన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వాళ్ల మీద పెత్తనం చేసుకో అంతే కానీ కేసీఆర్‌ను ఒక్క మాటంటే బిడ్డా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమన్నారు.



## రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ కేసులో జైలుకు వెళ్లకుండా ఉండేందుకే సాక్ష్యాలను మాయం చేశారంటూ తెలంగాణ సీఎంపై ఆయన మండిపడ్డారు. ఈ ఫోరెన్సిక్ ల్యాబొరేటరిలో జరిగిన ఈ ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగింది కాదన్నారు. ఇది సీఎం రేవంత్ డైరెక్షన్‌లో జరిగిందంటూ ఆయన బల్లగుద్ది చెప్పారు. ఈ ప్రమాదం వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ అంటూ రేవంత్‌ని వ్యాఖ్యానించారు. జైలుకు పోయే సమయం ఆసన్నమైందని.. అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైద్రాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారంటూ రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. పోలీసుల సహకారంతోనే సీఎం ఈ కుట్రపన్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ డైరెక్షన్‌లోనే పోలీసులు చేసిన దహనఖాండ ఇది అని అభివర్ణించారు. రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది గుండు సున్నా అని రేవంత్ పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రాజకీయాలు కాదు.. అభివృద్ధి ముఖ్యం



మొదటి పేజీ తరువాయి

కాదని, కేవలం అభివృద్ధి మాత్రమేనని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలోని మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భట్టి విక్రమార్క భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధిర పట్టణ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత 10 సంవత్సరాలుగా మధిర మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మధిర మున్సిపాలిటీలోని అన్ని వార్డులను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థుల గెలుపు రాజకీయాల కోసం కాదని.. అభివృద్ధి కోసమే అని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్-టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డబ్బు ప్రధానం కాదని.. అభివృద్ధే ప్రధానమని, వ్యక్తులకన్నా వ్యవస్థలే ముఖ్యమని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికి మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఏ అవసరం ఉన్నా ప్రజలందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ మధిర అభివృద్ధిపై తమ ఆలోచనలు పంచుకోవాలని కోరారు. మహిళలను వడ్డీలేని రుణాలతో స్వయం ఉపాధి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



## సింగరేణిని రక్షించేది బీజేపీ మాత్రమే

మొదటి పేజీ తరువాయి

గోదావరిఖని: రామగుండంలో భాజపాను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తాం. రూ.20వేల కోట్లతో ఎన్టీపీసీని విస్తరిస్తాం. సింగరేణిని రక్షించుకోకపోతే మూతపడే ప్రమాదముంది. కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోంది. తెలంగాణలో కారు పంక్చర్ అయింది. ఆ పార్టీలో ఉన్న నాయకులు తలో దారి చూసుకున్నారు. బీఆర్ఎస్‌లో జరిగిన అవినీతిపై కేసీఆర్ కుమార్తె కవిత కూడా చెబుతున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.4వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా?కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదు. రౌడీయిజం, గూండాయిజంపై ఆ పార్టీ బతుకుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు నడుస్తున్నాయి. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కాషాయ జెండా ఎగిరితేనే సింగరేణికి మనుగడ ఉంటుంది. గతంలో బీఆర్ఎస్‌కు చెప్పిన విధంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి. ఈ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను ప్రజలు గెలిపించాలి" అని కిషన్‌రెడ్డి కోరారు.

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 :** అగ్రనేతల పర్యటనలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో ఇన్నాళ్లూ మార్మోగిన వీధులన్నీ ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో ఓటర్ల బలం గణనీయంగా ఉంది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి మొత్తం 52,43,023 మంది ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఇందులో పురుష ఓటర్ల సంఖ్య 25,62,639 కాగా, 26,80,014 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఈ ఎన్నికల్లో కీలక పరిణామంగా కనిపిస్తోంది. వీరితో పాటు మరో 640 మంది ఇతర ఓటర్లు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,195 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లు (ఖీక్ష), 1,547 మంది సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. క్షేత్రస్థాయిలో 9,560 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు (ఖక్ష), 31,428 మంది ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచడానికి 137 స్టాం÷-రగ్ రూమ్‌లు, ఫలితాల లెక్కింపు కోసం 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం భారీ భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 25,000 మంది పోలీసు సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంచారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పాటించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా ఎన్నికల సంఘం అధికారులు నేరుగా పోలింగ్ సరళిని పర్యవేక్షించవచ్చు. మొత్తం 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో చూడాలి. ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన తర్వాత, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఆ తర్వాత ఫిబ్రవరి 14న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు మున్సిపల్ చైర్మన్ , డిప్యూటీ చైర్మన్ల ఎన్నిక ప్రక్రియ జరుగుతుంది. చివరగా ఫిబ్రవరి 16న కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, ప్రత్యేక సమావేశంతో ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

## సంతానం పేరుతో మోసం

### బంగారంతో ఉడాయించిన దుండగుడు

**భూదాన్ పోచంపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పరిధిలోని గాంధీనగర్‌లో సంతానం లేని దంపతులను లక్ష్యంగా చేసుకుని ఓ వ్యక్తి మోసానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతానం కోసం ఎదురుచూస్తున్న ప్రణీత దంపతులతో ఓ వ్యక్తి కేరళ యునాని వైద్యుడినని పరిచయం చేసుకున్నాడు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించాడు. ఓ తైలం ఇచ్చి దానిని ఒంటికి రాసుకుంటే 40 రోజుల్లో ఫలితం వస్తుందని నమ్మించాడు. మెడలోని బంగారాన్ని తీసి స్నానం చేసి వచ్చి తైలాన్ని రాసుకోవాలని చెప్పడంతో బాధితురాలు స్నానానికి వెళ్లగా సదరు వ్యక్తి నగలు తీసుకుని పరారయ్యాడు. స్నానం చేసి వచ్చిన తర్వాత నగలు కనిపించకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## కోదాడలో ఈడీ అధికారుల సోదాలు

**కోదాడ :** పట్టణానికి చెందిన ఓ రైస్ మిల్లర్ వ్యాపారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం ఉదయం నుంచే దాడులు నిర్వహిస్తున్నారు. వ్యాపారికి చెందిన కోదాడ పట్టణంలోని ఓ రైస్ మిల్లులో, కళాశాలలో, బంధువుల ఇళ్లతోపాటు మొత్తం ఆరు చోట్ల ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఆదాయా నికి మించి ఆస్తులు, సీఎంఆర్ బియ్యం ఎగవేత, నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు నుంచి రుణాలు పొందటంపై అధికారులు ఆరా తీస్తున్న ట్లు సమాచారం. దీనిపై ఈడీ అధికారుల ను వివరణ కోరగా సోదాలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు

## 'సర్' ప్రక్రియ కొనసాగాల్సిందే..

మొదటి పేజీ తరువాయి

ప్రక్రియ(సర్) కోసం 300మంది అధికారులను కేటాయించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే..80 మంది గ్రేడ్-2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొంది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు, వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి.. ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది. దీనివల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకాశమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు వెల్లడించింది.



# 420 హామీలు ఇచ్చి.. ఒక్క హామీని అమలు చేయలేదు

- రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసింది శూన్యం
- మెదక్ పర్యటన అంటూనే వణుకుతున్న రేవంత్
- దుబ్బాక ప్రచారంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట, ఫిబ్రవరి 9 :** రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే విమర్శించారు. 420 హామీలు ఇచ్చి ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. మెదక్ రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని హరీశ్‌రావు అన్నారు. అన్ని జిల్లాలు తిరుగుతున్న రేవంత్ రెడ్డి ఉమ్మడి మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని విమర్శించారు. ఇక్కడ హరీశ్‌రావు ఉన్నాడని భయపడుతున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చారు.. కానీ రేవంత్ పాలన అంత తుస్సే అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలో హరీశ్‌రావు పర్యటించారు. చెల్లాపూర్ వార్డులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌ను రేవంత్ తిడుతున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చి అభివృద్ధి పథకాలు అమలు చేయడం కేసీఆర్ తప్పా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిడితే ఓట్లు రావని.. పథకాలు అమలు చేస్తే వస్తాయని హితవుపలికారు. బూతులు మాట్లాడే రేవంత్‌కు పోలింగ్ బూత్‌లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పంద్రాగస్టుకల్లా రుణమాఫీ పూర్తి చేస్తానని దేవుళ్లపై రేవంత్ రెడ్డి ఒట్లు పెట్టిండని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు, గారడీలపై మెదక్ ప్రజలు నిలదీస్తారని ఇటువైపు చూడటం లేదని పేర్కొన్నారు. మెదక్‌లో రేవంత్ రెడ్డి ఒక్క వార్డులో కూడా గెలవడని తెలిపారు. రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ లేదు కానీ.. స్కామ్ క్యాలెండర్ అయితే ఇచ్చిండని విమర్శించారు. ప్రతి నెల ఏదో ఒక కుంభకోణం తెరపైకి తీసుకొచ్చాడని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి సురుకుపెట్టాలని అన్నారు. దుబ్బాక ఓటర్ల దెబ్బకు రేవంత్ రెడ్డికి దిమ్మ తిరగాలని అన్నారు. అలా కాకుండా కాంగ్రెస్‌కే ఓటేస్తే.. పథకాలు ఎగబెట్టినా నాకే ఓట్లు వేశారని రేవంత్ రెడ్డి అంటారని తెలిపారు. దుబ్బాకలో కాంగ్రెస్ ఏదైనా అభివృద్ధి చేస్తే చూపించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు పంచి గెలవాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన పథకాలు, అభివృద్ధితో పోలిస్తే ఈ డబ్బులు ఎంత అని ప్రశ్నించారు. దుబ్బాకలో బడి కట్టింది.. గుడి కట్టింది.. ఆస్పత్రి కట్టింది కేసీఆర్ అని గుర్తుచేశారు. రెండేళ్లలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. దుబ్బాకను ఇంకా అభివృద్ధి చేసే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి నోరు విప్పితే బూతులు తప్ప మంచిమాట రాదని అన్నారు. కేసీఆర్ హయాంలో భూముల విలువ పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు తగ్గడమే కాదు.. తెలంగాణ ప్రతిష్ట కూడా దిగజారిందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చేతిలో మోసపోని మనిషే లేదని పేర్కొన్నారు. హామీలు, గ్యారంటీల పేరుతో మోసం చేసి కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తెలంగాణ భవిష్యత్ గురించి ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డికి చురుకు తగిలితేనే పథకాలు అమలవుతాయని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

## ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలి

- ప్రతి ఒక్కరూ ఓటేసేలా చూసుకోవాలి
- పార్టీ నేతలకు సిఎం రేవంత్ దిశానిర్దేశం



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 :** మున్సిపల్ ఎన్నికల్లో నేతలు సమన్వయంతో ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితి గతులపై సీఎం రేవంత్ ఆరా తీశారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో పోలింగ్ వ్యూహంపై చర్చించారు. స్థానిక నేతల నేతృత్వంలో పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని మంత్రులకు సూచించారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఇవాళ, రేపు ఓటర్లకు నేతలు అందుబాటులో ఉండాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. ప్రతి ఓటరు బూత్ దగ్గరకు చేరుకునేలా చూడాలన్నారు. ఏమరుపాటు పనికిరాదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటేసేల చూడాలన్నారు.



## రాష్ట్రంలో పెరిగిన అత్యాచారాలు, హత్యలు

- మున్సిపల్ ఎన్నికల తరువాత పన్నుపోటు
- సిఎం రేవంత్‌పై ఎంపీ డీకే అరుణ ఆరోపణలు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 :** రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దారుణాలు పెరిగిపోయాయని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ట్యాక్స్‌లు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఎంపీ డీకే అరుణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వ లేదని చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని అరుణ తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ప్రచారం నిర్వహించానని చెప్పుకొచ్చారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్, భూత్‌పూర్, జడ్చర్ల మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అవసరముందని ఎంపీ అన్నారు. మహబూబ్‌నగర్ చుట్టుపక్కల గ్రామాలు విలీన గ్రామాలుగా కలిశాయని ఎంపీ అరుణ వివరించారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం మాస్టర్ కూడా అవసరం ఉందని చెప్పుకొచ్చారు. పట్టణాల్లో స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలవగానే సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. అవినీతి రహిత, పారదర్శకమైన పాలన అందించడమే బీజేపీ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై దృష్టి సారించి.. కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ మేనిఫెస్టోను ప్రజలకు అనుకూలంగా తయారుచేసి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని డీకే అరుణ పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌కు కాదు.. బిఆర్ఎస్‌కు ఓటేయండి

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 9 :** మున్సిపల్ ఎన్నికల వేళ పటాన్‌చెరు కాంగ్రెస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే.. కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్న మహిపాల్ రెడ్డి, పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డి సహా కొందరు అనుచరులు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తమ నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనాలు రాలేదన్న కారణంతో.. మహిపాల్ రెడ్డి అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఆయన అధికారికంగా బీఆర్ఎస్‌లో చేరతారని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన మహిపాల్ రెడ్డి.. ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## సిఎం వ్యాఖ్యలపై మండిపడ్డ గొగోయ్

**పాక్‌తో సంబంధాలు అండగట్టడంపై ఆగ్రహం**
**చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరిక**

**గౌహతి, ఫిబ్రవ రి9 :** అస్సాంలో రాజకీయ వాతావరణం సోమవారంనాడు ఒక్కసారిగా వెడెక్కింది. తన కుటుంబానికి పాకిస్థాన్ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్‌తో సంబంధాలున్నాయంటూ ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చేసిన ఆరోపణలపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు. 'సిట్' నివేదికను ముఖ్యమంత్రి తొక్కిపెట్టారని ఆరోపించారు. తన భార్య, మైనర్ పిల్లలను కూడా ఇందులోకి లాగారని, వారిపై అసంబద్ధమైన, తప్పుడు ఆరోపణలు చేసిన సీఎంపై చట్టపరంగా ముందుకు వెళ్తామని చెప్పారు. గొగోయ్ 2013లో పాకిస్థాన్ వెళ్లడాన్ని హిమంత బిశ్వ శర్మ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తాజాగా ప్రశ్నించారు. వీసా పర్మిషన్ ఉన్న ప్రాంతాలకు, ఆయన పర్యటించిన లొకేషన్లకు మధ్య తేడాలున్నాయని అన్నారు. తక్షశిల అంటూ గొగోయ్ చెప్పిన ప్రదేశం ఇస్లామాబాద్‌లో లేదని, పాకిస్థాన్‌లోని రావల్పిండి జిల్లాలో ఉందని అన్నారు. ఇది అనేక ప్రశ్నలకు తావిస్తోందన్నారు. లాహోర్, కరాచీ, ఇస్లామాబాద్‌లకు మాత్రమే పర్యటనకు వీసా అనుమతిస్తుంటే ఆయన తక్షశిల ఎలా వెళ్లారని నిలదీశారు. నిర్దేశిరచిన ప్రదేశాల్లో మినహా ఇతర చోట్లకు వెళ్లేందుకు పాకిస్థాన్ ఇమిగ్రేషన్ రూల్స్ అనుమతించవన్నారు. రావల్పిండిలో పాకిస్థాన్ ఆర్మీ జనరల్ హెడ్‌క్వార్టర్స్ కూడా ఉందన్నారు. గొగోయ్ వెళ్లడానికి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని అన్నారు. శర్మ ఆరోపణలపై గౌరవ్ గొగోయ్ వెంటనే స్పందించారు. శర్మ కుటుంబంపై భూముల ఆరోపణలున్నాయని, వాటి నుంచి దారి మళ్లించేందుకే తమపై వివాదాలు సృష్టిస్తున్నారని గౌహతిలో మీడియాతో మాట్లాడుతూ గొగోయ్ చెప్పారు. తనకు పాక్‌తో సంబంధాలున్నట్టు రుజువు చేసే ఎలాంటి సమాచారం లేకపోవడంతో 'సిట్' నివేదికను ముఖ్యమంత్రి తొక్కిపెట్టారని తెలిపారు. ఆయన చెప్పినట్టు ఇది జాతీయ భద్రతా అంశమే అయితే ఆరు నెలలుగా ఎందుకు ఖాళీగా కూర్చున్నారని ప్రశ్నించారు. 'సిట్ నివేదికలో ఎలాంటి రుజువులు లేవన్నదే అసలైన నిజం' అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జనసమీకరణ జరుపుతుండటం, ప్రజాదరణ పెరుగుతుండటం చూసి ముఖ్యమంత్రి ప్రెస్‌కాన్ఫరెన్స్ అంటూ తనపై ఆరోపణలు దిగారని తెలిపారు. ముఖ్యమంత్రి కుటుంబానికి 12,000 బిఘాల భూములున్నట్టు తాము వెల్లడించడంతో ఆయన తాజా డ్రామాకు తెరలేపారని అన్నారు.

## ఓటుకు నోటు సాక్ష్యాలు దగ్ధం

- ఫోరెన్సిక్ అగ్నిప్రమాదం ఓ కుట్ర
- ప్రచారంలో సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఆరోపణలు



**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 9 :** నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఓటుకు నోటు కేసు సాక్ష్యాలను కాల్చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. అనుచిత వ్యాఖ్యలు చేసే సీఎం రేవంత్‌రెడ్డికి పోలింగ్ కేంద్రంలోనే బుద్ధి చెప్పాలని అన్నారు. 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. భూపాలపల్లి సింగరేణిని ఆగం చేసేందుకు చూస్తున్నారని ఆరోపణలు చేశారు. తులం బంగారం, రూ.4వేల పెన్షన్ వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయాలని అన్నారు. కేసీఆర్ పథకాలు తీసుకుంటున్న వాళ్లు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఇవ్వాళ, రేపు మద్యం, డబ్బులు పంచి ఓట్లు వేయించుకోవాలని చూస్తారని ఎద్దేవా చేశారు. మరోసారి మోసపోయి భస్మాసుర చేయి లాంటి కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని సూచించారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆగ్రహించారు. 12ఏళ్లలో తెలంగాణకు బీజేపీ నయాపైసా పనిచేయలేదని అయ్యారు. జయశంకర్ భూపాలపల్లిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి కేటీఆర్ వచ్చారు. ఆయన పర్యటనలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేటీఆర్ కార్నర్ మీటింగ్ సందర్భంగా సామాజిక కార్యకర్త, దివంగత రాజలింగమూర్తి ఫ్లెక్సీ తొలగించారు. కేటీఆర్ కార్నర్ మీటింగ్ నేపథ్యంలో రాజలింగమూర్తి ఫ్లెక్సీ తొలగింపుపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తండ్రి ఫ్లెక్సీని కావాలనే బీఆర్ఎస్ నేతలు తొలగించారంటూ రాజలింగమూర్తి కుమార్తె ఆరోపించారు.

## స్పీకర్ తీరుపై విపక్షాల అసంతృప్తి

- అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచన
- ఖర్గేతో వివిధ పక్షాల నేతల భేటీలో చర్చ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 :** పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంతో ఇటు అధికార పక్ష సభ్యులు, అటు విపక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గందరగోళ పరిస్థితుల మధ్య ఉభయసభల కార్యకలాపాలకు తరచు అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడేందుకు అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో విపక్షాలు ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆప్రకారం బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బడ్జెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13తో ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకూ జరుగుతాయి. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్పీ) తదితరల పార్టీల ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొన్నట్టు సమాచారం. మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై దాడికి సిద్ధమయ్యామంటూ తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఖండించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తాము నిరసన తెలిపామని, హింసకు దిగాలని తాము అనుకోలేదని, విపక్షాలను ఎదుర్కొనే ధైర్యం ప్రధానికి లేకపోవడం వల్లే భయపడి సభకు రాలేదని మహిళా ఎంపీలు ఆ లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. ఎంపిక చేసి మరీ 8 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేశారని, మాజీ ప్రధానులపై బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి, పలువురు మహిళా ఎంపీలు ఈ లేఖపై సంతకాలు చేశారు.

## ఐటి కంపెనీల్లో ఏఐ నిపుణుల నియామకాలు

**వీసా ఖర్చులకు వెనకాడని ప్రముఖ సంస్థలు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 :** భవిష్యత్తు ఏఐదే అని అమెరికా టెక్ కంపెనీలు బలంగా నమ్ముతున్నాయి. భారీగా పెట్టుబడులు కుమ్మరిస్తున్నాయి. అంతేకాకుండా, ఈ రంగానికి చెందిన విదేశీ నిపుణులను హెచ్-1బీ వీసాల ద్వారా పెద్ద ఎత్తున నియమించుకుంటున్నాయి. వీసా ఫీజులు పెరిగినప్పటికీ అమెరికా టెక్ సంస్థలు అక్కడి కార్మిక శాఖకు వీసా పిటిషన్లు దరఖాస్తు చేసుకుంటున్నాయి. నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) సంస్థ జరిపిన అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. అమెజాన్, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్ యాపిల్ 2025 ఆర్థిక సంవత్సరంలో విదేశీయుల నియామకాల కోసం సమర్పించిన లేబర్ కండీషన్ అప్లికేషన్లలో(ఎల్‌సీఏ) మెజారిటీ ఏఐ సంబంధిత ఉద్యోగాలవే. ఫారినర్ల తరఫున హెచ్-1బీ పిటిషన్‌ల దాఖలకు మునుపు కంపెనీలు ఎల్‌సీఏను దాఖలు చేస్తాయన్న విషయం తెలిసిందే. అమెజాన్ సమర్పించిన 60 శాతం ఎల్‌సీఏ దరఖాస్తులు ఏఐ సంబంధిత ఉద్యోగాల కోసమేనని ఎన్ఎఫ్ఏపీ అధ్యయనంలో తేలింది. మెటా ఎల్‌సీఏ దరఖాస్తుల్లో 58 శాతం, గూగుల్ ఎల్‌సీఏ దరఖాస్తుల్లో 71 శాతం ఏఐ సంబంధిత ఉద్యోగాలవేనని తెలిసింది. ఏఐ రంగంలో నిలదొక్కుకునేందుకూ అమెరికా సంస్థలు విదేశీ నిపుణులపై ఆధారపడుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

ఫోర్బ్స్ కథనం ప్రకారం, అమెరికన్ టెక్ కంపెనీలు ఇప్పటికే ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇదే క్రమంలో ప్రతిభావంతులైన విదేశీ ఉద్యోగుల వీసా ఖర్చుల విషయంలో కూడా వెనకాడట్లేదు. ఖర్చులు తగ్గించుకునేందుకే కంపెనీలు హెచ్-1బీ వీసాదారులకు ఉద్యోగాలు ఇస్తాయన్న విమర్శ ఇకపై చెల్లుబాటు కాదని కూడా విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. 1990-2010 మధ్య కాలంలో అమెరికా ఉత్పాదకతలో 30 శాతం -50 శాతం స్టెమ్ రంగాలకు చెందిన విదేశీ నిపుణులు కారణమని కొందరు ఆర్థికవేత్తలు అంచనావేశారు. ఏఐ రంగంలో అమెరికా అగ్రగామిగా ఉండాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. అయితే, వలసలపై ఆయన అమలు చేస్తున్న కఠిన ఆంక్షల కారణంగా అమెరికా వెనకబడే అవకాశం ఉందన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి.

## పార్కింగ్ స్థలాన్ని కాపాడిన హైడ్రా

**కబ్జాకు గురైన 1600 గజాలు స్వాధీనం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 :** హైదరాబాద్ శివార్లలోని నార్సింగి ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై హైడ్రా అధికారులు మరోసారి ఉక్కుపాదం మోపారు. ఒక ప్రజాప్రతినిధి అండతో కబ్జాకు గురైన అత్యంత విలువైన పార్క్ స్థలాన్ని అధికారులు విజయవంతంగా తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ప్రజల సౌకర్యార్థం కేటాయించిన స్థలాలను అక్రమంగా ఆక్రమిస్తే ఊరుకునేది లేదని ఈ చర్య ద్వారా అధికారులు స్పష్టమైన హెచ్చరికలు పంపారు. నార్సింగిలోని అరుణోదయ హౌసింగ్ సొసైటీలో సుమారు 1,600 గజాల విస్తీర్ణం కలిగిన పార్క్ స్థలాన్ని ఒక ప్రజాప్రతినిధి అక్రమంగా తన ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. ఆక్రమణదారులు ఆ స్థలం చుట్టూ భారీ ప్రహరీ గోడను నిర్మించి, దానిని తమ వ్యక్తిగత ఆస్తిగా మార్చుకునే ప్రయత్నం చేశారు. ఈ కబ్జాపై స్థానిక నివాసితులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు తక్షణమే స్పందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు, అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను జెసిబిలతో కూల్చివేసి ఆక్రమణలను తొలగించారు. అనంతరం ఆ 1,600 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, దానిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ అక్రమాలకు పాల్పడిన కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కూడా అధికారులు సిద్ధమవుతున్నారు. కోట్ల రూపాయల విలువైన పార్క్ స్థలం కబ్జాకు గురవుతున్నా, స్థానిక మున్సిపల్ అధికారులు నోరు మెదపకపోవడంపై అరుణోదయ హౌసింగ్ సొసైటీ సభ్యులు , స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికారుల అండదండలు లేనిదే ఇంత పెద్ద మొత్తంలో స్థలం కబ్జాకు గురికాదని వారు ఆరోపించారు. ఏది ఏమైనప్పటికీ, హైడ్రా జోక్యంతో తమ పార్క్ స్థలం తిరిగి తమకు దక్కడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తిరుమలలో సొంత డెయిరీపై ఆలోచించాలి!



**తిరుమల పవిత్రతను కాపాడేందుకు తీసుకునే చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుంది. ఎందుకంటే దాదపు ఏడాదిన్నరగా తిరుమల లడ్డూ కల్తీ చుట్టూనే రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో సిట్ దర్యాప్తు సాగుతోంది. ప్రత్యేక విచారణలు చేపట్టారు. మరో ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇక తిరుమల పవిత్రత దెబ్బతినకుండా, రాజకీయాలకు తావు లేకుండా కఠిన చర్యలకు అసవరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దృష్టి పెడితే మంచిది. తిరుమలలో తీసుకునే నిర్ణయాలను ఇప్పుడు ఎవ్వరూ ప్రశ్నించరు. భక్తులకు వసతి పెంచడం, సౌకర్యాలు పెంచడం, శీఘ్రగతిన దర్శనాలు కల్పించడంలో ప్రధాన నిర్ణయాలు జరగాలి. తిరుమలలో సామాన్యులకు సత్వర దర్శనం అన్నది కలగా మారింది. వివిపిల తాకిడి పెరుగుతోంది. స్వామిని దర్శించుకున్న వారే ఇంకా దర్శించుకుంటున్నారు. అలాగే తిరుమలలో ప్లాస్టిక్ నిషేధం జరగాల్సి ఉంది. లడ్డూలను తాటాకు బుట్టల్లో సరఫరా చేస్తామని గతంలో ప్రకటించినా అమల్లోకి రాలేదు. మంచినీటి సమస్యలు రాకుండా చూడాలి. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటుపై ఆలోచన చేయడం లేదు.**

ఇకపోతే తెలంగాణ నేతల సిఫార్సులపై వివక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ వివక్ష తొలగిపోవాలి. తెలంగాణ నేతలను చిన్నచూపు చూడడం ద్వారా ప్రభుత్వం ఈ ప్రాంతా ప్రజలను అవమానపరుస్తోంది. తిరుమల కొండల్లో పచ్చదనం పెంచాల్సి ఉంది. అడువుల్లో సామాజిక వనాలు పెరగాలి. ఇవన్నీ వదిలేసి ఇంకా కల్తీ నెయ్యి వ్యవహారంతో టిడిపి కూటమి ఒకవైపు, వైకాపా నేతలు మరో వైపు అన్నట్లుగా విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం సరికాదు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ ఘటనలు దిగజారుతున్న రాజకీయ విలువలకు పరాకాష్టగా మారాయి. తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు జోక్యంతో సిబిఐ ఏర్పాటు చేసిన సిట్ నివేదిక బహిరంగ పరచకుండానే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ స్వంత వ్యాఖ్యానాలతో రాజకీయంగా లబ్ది పొందే చర్యలకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కొవ్వు అంటూ అధికార కూటమి చేసిన ప్రచారానికి ప్రాయశ్చితంగా యజ్ఞాలు, యాగాలు, పూజలకు వైసిపి నాయకులు తెరతీసారు. దీనికి పోటీగా లడ్డు కల్తీ చేసిన వైసిపి నేతలంటూ అనేక జిల్లాల్లో పేరు, ఊరు లేని బ్యానర్లు వెలిశాయి. పరస్పర విమర్శలతో మొదలై, హద్దులు దాటిన వ్యక్తిగత విమర్శలకు చేరి, దాడులకు, గృహ దహనాల వరకు ఆ వివాదం విస్తరించింది. తిరుపతి లడ్డు కోట్ల మంది ప్రజల విశ్వాసంతో ముడిపడిన సున్నితమైన అంశం. తమ విశ్వాసానికి తగ్గట్టుగా ప్రసాదం పవిత్రంగా వుండాలని కోరుకుంటారు. అలాంటి లడ్డూలో ఆవు కొవ్వు, ఇతర జంతువుల కొవ్వుల లాంటివి కలిశాయని ముఖ్యమంత్రి చెప్పడంతో తక్షణం నిజానిజాలు తేల్చి దోషులకు శిక్ష వేసివుంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ మతానికి అపచారం జరిగిందంటూ కనకదుర్గమ్మ గుడి మెట్లు కడిగారు.

ఇలా కాకుండా నిజాలు నిగ్గుతేల్చి దోషులను కోర్టు ముందు నిలబెట్టి ఉంటే బాగుండేది. అన్నింటికి మించి తిరుమల శ్రీవారు కోట్లకు పడగలెత్తారు. ఆయనకు వందలాది గోవులు కూడా ఉన్నాయి. నిజానికి చిత్తశుద్ది ఉంటే గోశాలలను విస్తరించి, సొంత డెయిరీ ఏర్పాటు చేసివుంటే పేచీ వచ్చేది కాదు. గోశాలలను పెంచి, డెయిరీ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యా కొంత తీరుతుంది. నెయ్యి కల్తీ సమస్య ఉత్పన్నం కాదు. కల్తీ తీవ్రమైన ఆరోపణ కాబట్టి సంబంధిత అధికార సంస్థల ద్వారా నేరాన్ని నిరూపించి నిందితులకు శిక్షపడేలా చేయడం ప్రభుత్వ బాధ్యత. అందుకోసం నియమించిన సిట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. నివేదికలో ఏముందో ప్రకటించకుండానే మరో కమిటీ వేయడంలో అర్థం లేదు. నిజానికి కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్టను దెబ్బ తీసేందుకు జరిగిన కుట్ర అనడంలో సందేహం లేదు. హిందూ మతంపై దాడి అని అనడంలోనూ సందేహం లేదు. గతంలో జరిగిన రామతీర్థం, అంతర్వేది, దుర్గ గుడి విగ్రహాల విధ్వంసం, రథాలు కాలిపోవడం లాంటి విషయాలను ప్రస్తావించి ఇదంతా హిందూ మతాన్ని దెబ్బతీసి నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల చర్యలు అంతిమంగా తమ రాజకీయ పబ్బం గడుపుకునేలా తయారయ్యాయి. ఈ సమస్యలనే ఇక ఇంతటితో ముగించాలి. తిరుమల శ్రీవారికి అవసరమైన ఆవునెయ్యిని పొందేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. తిరుమలలో డెయిరీ ఏర్పాటు చేస్తే మరీమంచిది.

శాశ్వతంగా సమస్యకు పరిష్కారం దక్కగలదు. వేలకోట్లు వృధా చేసే బదులు శ్రీవారికి అవసరమైన నెయ్యి, పాలు, వెన్న, మీగడలను పొందేందుకు ఇదే సరైన సమయం. డబ్బులకు కొదవ లేదు. గోవులకు కొదవ లేదు. చంద్రబాబు హెరిటేజ్ నడిపిన అనుభవంతో తిరులమ శ్రీవారి కోసం ఓ మంచి డెయినీ ఏర్పాటు చేస్తే మంచిది. సుగంధ ద్రవ్యాలను కూడా కొండపై పండించే అవకాశలను పరిశీలించాలి. పూదోటలను విస్తరించాలి. ఆ దిశగా కూటమి నేతలు ఆలోచనలు చేయాలి. సమర్థులైన అధికారులు, బోర్డు ఛైర్మన్, సభ్యులు, ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. రాజకీయ తాబేదార్లకు బోర్డును అప్పగించినంతకాలం ఇది ఇది సాధ్యం కాదు. ఇకపోతే తిరుమల కల్తీ వ్యవహారాన్ని కోర్టుల తుది తీర్పుకు వదిలేయాలి. అప్పటి వరకు రాజకీయ విమర్శలకు దిగకపోవడం మంచిది.

# మున్సిపల్ ప్రచారంలో చెమటోడ్చిన నేతలు

- సిఎం సహా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేల ప్రచారం
- బిజెపి నుంచి రంగంలోకి దిగిన ఇద్దరు కేంద్రమంత్రులు
- బిఆర్ఎస్‌లో అంతా తామే అయిన కెటిఆర్, హరీష్ రావు




**హైదరాబాద్, ఫిబ్రవరి 9 :** మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వంలో అన్ని పార్టీల నేతలు చెమటోర్చారు. చివరి రోజుల ఆయా ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, విపక్ష నేతలు సుడిగాలి పర్యటనలు చేపట్టి ప్రచారంలో పైచేయి సాధించాలని చూశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ప్రజాప్రతినిధులు సైతం ప్రచారంలో బిజీగా గడిపారు. సోమవారం సాయంత్రం ప్రచారం ముగియనుండడంతో ప్రరచారాన్ని ఉరుకులు పెట్టించారు. ఆయాచోట్ల కాంగ్రెస్ , బిజెపి, బిఆర్ఎస్ నేతలు తమ నియోజక వర్గాల పరిధిలోని మున్సపల్ కేంద్రాల్లో ప్రతిష్టాత్మక ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అభ్యర్థులు పట్టణ ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు తమదైన శైలిలో ప్రచారం చేపట్టారు. మరోవైపు అమలుకాని కాంగ్రెస్ హామీలను ఎండగడుతూ బిఆర్ఎస్ నేతలు ముందుకు సాగారు. అన్ని పార్టీల వాళ్లు ర్యాలీలతో హోరెత్తించారు..గడపగడపకూ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ముఖ్యంగా మహిళలకు బొట్టుపెట్టి తమ పార్టీ విధానాలను వివరిస్తూ ఓట్లు అడగడం విశేషం. బిఆర్ఎస్ అగ్రనేతలైన కేటీఆర్, హరీశ్‌రావు ప్రచారపర్వాన్ని తమ భుజాన వేసుకున్నారు. కారుకు ఓటేసి మోసపూరిత కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిస్తూ ముందుకుసాగారు. సిఎం రేవంత్ సహా మంత్రులు పలు చోట్ల ప్రచారంలో కనిపించారు. బిజెపిలో ఇద్దరు కేంద్రమంత్రులు బండి సంజయ్, కిష్ రెడ్డి, అధ్యక్షుడు రాంచంద్రరావు సహా ఎంపిలు, ఎమ్మెల్యేలు ప్రచారం చేపట్టారు. గతంలో ఎప్పుడూ లేనంతగా బిజెపి కూడా ప్రచారంలో దూకుడు ప్రదర్శించింది. బల్దియాల్లో జరిగిన ప్రచార సభల్లో పాల్గొన్నారు. కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి ఓటర్లతో మమేకమ య్యారు. మహిళలు, యువతతో ముచ్చటించి సమస్యలసు తెలుసుకున్నారు. ప్రచార ర్యాలీల్లో పాల్గొని క్యాడర్‌లో జోష్ నింపారు. అన్ని పార్టీలు మున్సిపాలిటీల వారీగా ఇచ్‌చార్జిలను నియమించి పక్కా ప్రణాళికతో క్యాంపెయిన్‌ను హోరెత్తించారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సభలకు జనం నుంచి మంచి స్పందన కనిపించింది. ఇప్పటికే అన్ని ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ సహా బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలు తమ అభ్యర్థుల తరఫున జోరుగా ప్రచారం చేపట్టారు. సోమవారం పలు జిల్లాల్లోని బల్దియాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి పలు జిల్లాల్లోని మున్సిపాలిటీలను చుట్టేశారు. అలాగే మెజార్టీ మంత్రులు తమ నియోజకవర్గాల పరిధిలోని బల్దియా ల్లోనే మకాంవేసి ఓట్లు అభ్యర్థించారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ సైతం పలు మున్సిపాలిటీల్లో ప్రచారం సాగించారు. మున్సిపల్ ప్రచారపర్వంలో బీజేపీ కూడా ముందంజలో ఉంది.ఆ పార్టీ అభ్యర్థుల తరఫున కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేశారు. ఆ పార్టీ ఎంపీలు అర్వింద్, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వ ర్‌రెడ్డి, డీకే అరుణ తమ నియోజకవర్గాల పరిధిలోని మున్సిపాలిటీలను చుట్టేశారు. సంకల్ప యాత్రల పేరిట ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, మహామహులు ప్రచారం సాగించారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ

## రెండ్రోజులు మద్యం దుకాణాలు బంద్



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 :** మద్యం ప్రియులకు మున్సిపల్ ఎన్నికలు షాక్ ఇచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ కీలక ప్రకటన చేసింది. రెండు రోజుల వైన్స్ బంద్ కానున్నాయి. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సమయం ఆసన్నమవుతోంది. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. 13 ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఆయా మున్సిపాలిటీల పరిధిలోని మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఈనెల 9వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల, ఆబ్కారీ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా 13వ తేదీ వరకు ఫలితాల నేపథ్యంలో వైన్స్, బార్లు మూసివేయనున్నారు. మరోవైపు.. సోమవారంతో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. సాయంత్రానికి మైకులు మూగబోయాయి. గతానికి భిన్నంగా ఈసారి జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు అధికార, ప్రతిపక్షాల మధ్య యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. వ్యూహాలు, ప్రతి వ్యూహాలతో రంగంలోకి దిగిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఒకరిపై మరొకరుపై చేయి సాధించాలన్న పట్టులతో ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలతో పాటు ఆయా పార్టీల నుంచి రెబల్స్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ప్రచారంలో మునిగి తేలారు. ర్యాలీలు, డప్పు చప్పుళ్లు, డీజే పాటల మోతలతో ప్రచారాన్ని హోరెత్తించారు. చివరి రోజు సుడిగాలి పర్యటనలకు నేతలు సిద్ధం అయ్యారు.

# భారీ ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ గుట్టు రట్టు

## రూ.5,000 కోట్ల దందాను పసిగట్టిన జిఎస్టీ ఇంటిలిజెన్స్

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 :** హైదరాబాద్‌లో భారీ ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ గుట్టు రట్టు అయ్యింది. ఫినటెక్ ముసుగులో రూ.5,000 కోట్ల దందాను డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ పట్టుకుంది. ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో డొల్ల కంపెనీలతో కోట్లాది రూపాయల మళ్లింపు చేస్తున్నట్లు డీజీజీఐ గుర్తించింది. 5 వేల కోట్ల రూపాయలు టాక్స్ ఎగ్గొట్టి దుబాయ్‌కి మళ్లించినట్లు తేలింది. టెక్నాలజీని వాడిన హైదరాబాద్ వాసులు బ్యాంకులకే టోకరా వేశారు. ఓటీపీ లేకుండానే 5 వేల కోట్లు నిధుల బదలాయింపు జరిపారు. దుబాయ్ కేంద్రంగా 'మాస్టర్ మైండ్' కొనసాగింది.. హైదరాబాద్‌లో తీగ లాగితే కదిలిన డొంక కదిలింది. నిబంధనలకు విరుద్ధంగా రియల్ మనీ గేమింగ్.. జీఎస్టీ ఎగ్గొట్టేందుకు ఎస్క్రో ఖాతాల వినియోగించినట్లు డీజీజీఐ తెలిపింది. ఓషియానిక్ వెబ్ సొల్యూషన్స్, వెబ్‌విన్ సొల్యూషన్స్ అనే నకిలీ కంపెనీల ద్వారా నిధుల మళ్లించారు. వెబ్‌సైట్ల ద్వారా అక్రమ దందా సాగింది. బ్యాంకింగ్ వ్యవహారాలను దుర్వినియోగం చేసి, ఆడిట్‌కు దొరక్కుండా జాగ్రత్తపడ్డారు కేటుగాళ్లు. 'విగోఫిన్' డైరెక్టర్లు ప్రభు కుమార్, రాజశేఖర్ రెడ్డిలపై అధికారుల నిఘా పెట్టారు. ప్రధాన నిందితుడు దుబాయ్ నుంచి ఈ నెట్‌వర్క్‌ను నడిపిస్తున్నట్లు గుర్తించారు.

# నేడు పోలింగ్ మెటీరియల్ పంపిణీ

**సిద్దిపేట, ఫిబ్రవరి 9 :** మున్సిపల్ ఎలక్షన్లకు సంబంధించి ఈ నెల 10న పోలింగ్ మెటీరియల్ పంపిణీ సజావుగా నిర్వహించాలని జిల్లా ఎలక్షన్ ఆఫీసర్, కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. 11న పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి టిఫిన్, భోజనం, స్నాక్స్ వంటివి అందజేయాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని స్పష్టం చేశారు. 13 జరిగే కౌంటింగ్ పక్రియలో ఏజంట్లకు పరిమిత పాస్‌లు ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎన్నికలు జరగనున్న హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీల పరిధిలో డ్రై డేలను ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ కే. హైమావతి అన్నారు. నేటి సాయంత్రం 5 గంటల నుంచి 11న పోలింగ్ పక్రియ ముగిసే వరకు, ఓట్ల లెక్కింపు 13న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు పక్రియ పూర్తి అయ్యే వరకు ఆయా మున్సిపాలిటీల పరిధిలో డ్రై డే గా ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా మున్సిపాలిటీల పరిధిలో మద్యం, రిటైల్ షాప్స్, బారులు, కల్లు దుకాణాలు అన్ని మూసి ఉంచాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఓటు కోసం నేతల పాట్లు

- ఎక్కడెక్కడో ఉన్న వారి కోసం ఆరా
- వచ్చేవారికి ఆఫర్లతో రప్పించే యత్నం

**నిజామాబాద్, ఫిబ్రవరి 9 :** మున్సిపాలిటీ ఎన్నికలకు ఒక్కరోజే సమయం ఉండడంతో ఓట్లు వేసే వారి గురించి అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. ఉపాధి, ఉద్యోగాల కోసం వెళ్లిన వారిని రప్పించేందుకు రంగంలోకి దిగారు. బరిలో ఉన్న అభ్యర్థులు తమ వార్డులోని ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారు.. ఎవరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని ఆరా తీస్తూ వారిని ప్రసన్నం చేసుకునేందుకు పరుగులు పెడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు ఒక్క రోజే ఉండడంతో గెలుపే లక్ష్యంగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేలా పలువురు అభ్యర్థులు హామీలతో పాటు ఆఫర్లు ఇస్తున్నారు. గంపగుత్త ఓట్లను రాబట్టేందుకు కులసంఘాలకు భారీగా తాయిలాలతో గాలం వేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణాల్లో ఓటర్లు వివిధ పనులో బీజిగా ఉంటుండడంతో అభ్యర్థులు తెల్లవారగానే ఓటర్ల ఇళ్లకు అభ్యర్థులు తమ అనుచరగణంతో కాలనీల్లోని పలువురి ఇళ్లకు వెళ్లి ఓట్లు అడుగుతున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో ఆయా వార్డుల్లో ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ అభ్యర్థుల గుర్తులతో కూడిన కరపత్రాలను ఓటర్లకు అందిస్తూ తమకే ఓటు వేయాలని ప్రాధేయపడుతున్నారు. ఈనెల 11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ దేవుళ్ళు ఓటు వేసి ఎవరిని గెలిపిస్తారో వేచి చూడాల్సిందే. మున్సిపల్ ఎన్నికల్లో ఒక్కో ఓటు కీలకం కానుంది. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అభ్యర్థులు ఒక్కో ఓటు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అభ్యర్థులు మున్సిపల్ ఎన్నికల్లో ప్రతీ ఓటు తమకే పడేలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఓటరు జాబితాలో నమోదైన ఓటర్ల ఇంటింటికి అభ్యర్థులు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగాలు, ఉపాధి రీత్యా ఇతర పట్టణాలకు ప్రాంతాలకు వలస వెళ్లిన పట్టణ ఓటర్లను రప్పించేందుకు అభ్యర్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు జాబితాలో నమోదై స్థానికంగా ఉండని వారిని తమవైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.

# మెదక్ జిల్లాలో పక్కాగా ఏర్పాట్లు

## అల్లర్లు సృష్టిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు: ఎస్పీ

**మెదక్, ఫిబ్రవరి 9 :** మెదక్ జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీ లకు సంబంధించి ఈ నెల 11న జరగనున్న ఎన్నికల కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గొడవలకు పాల్పడినట్లయితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో సుమారు 600 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 75 వార్డులకు 150 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయని, ఇందులో 21 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టినట్లు వివరించారు. 1,206 మంది నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లను ముందస్తు బైండోవర్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టడంతో ఆదివారం వరకు రూ.2,69 లక్షల నగదు, 40 కేసుల్లో సుమారు రూ. 5,23,250 విలువైన 557.44 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రూ.3,36,000 విలువగల 336 గ్రాముల డ్రగ్స్, రూ.9,25,250 విలువైన ఫ్రీబీస్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎంసీసీ ఉల్లంఘించిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని ప్రజలను కోరారు.



# తిరుమల లడ్డూ కౌంటర్లలో ఆన్‌లైన్ పేమెంట్

## క్యూఆర్ కోడ్‌తో విక్రయానికి యోచన

**తిరుమల, ఫిబ్రవరి 9 :** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు సులభంగా లడ్డూలు పొందేలా టీటీడీ ఆలోచనలు చేస్తోంది. లడ్డూ విక్రయ కేంద్రంలోని ప్రతి కౌంటర్ వద్ద యూపీఐ పేమెంట్‌కు అవకాశం కల్పించనుంది. దీంతో చిల్లర కోసం వెతుక్కునే పనిలేకుండా పోనుంది. అలాగే ఆన్‌లౌన్ పేమెంట్‌తో నగదు లెక్కింపు సమస్యా తీరనుందని అంటున్నారు. ఏటా లడ్డూల విక్రయాలు భారీగా పెరుగుతున్నాయి. కౌంటర్ వద్ద భక్తులు నగదు చెల్లించి లడ్డూలు పొందుతున్నారు. శ్రీవారి ఆలయం వెనుకభాగంలోని లడ్డూ విక్రయ కేంద్రంలో గతేడాది కియోస్క్ యంత్రాలను టీటీడీ అందుబాటులోకి తెచ్చింది. ఇటీవల యూపీఐ పేమెంట్లు చేసే వారి సంఖ్య పెరిగిన క్రమంలో ఈ నూతన యంత్రాలను అందుబాటులో ఉంచింది. కావాల్సిన లడ్డూల సంఖ్య ఎంపిక చేసి యూపీఐ ద్వారా పేమెంట్ చేస్తే వచ్చే రశీదు ఆధారంగా కౌంటర్‌లో లడ్డూలు పొందవచ్చు. అయితే, ఈ యంత్రాల వద్ద ఇటీవల రద్దీ అధికం కావడం, యంత్రాల్లో సాంకేతిక ఇబ్బందులు, మళ్లీ లడ్డూల కోసం కౌంటర్ క్యూలైన్లలో నిలబడడం తదితర కారణాల నేపథ్యంలో కౌంటర్ల వద్దే పేమెంట్ క్యూఆర్ కోడ్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. తద్వారా అదనంగా కియోస్క్ యంత్రాల ముందు నిలబడే అవసరం ఉండదని, నేరుగా కౌంటర్‌లోనే లడ్డూలు పొందవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ సర్వీసును ఇచ్చేందుకు ఓ బ్యాంక్ కూడా ముందుకు వచ్చినట్టు సమాచారం. తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని కౌంటర్లలో ఈ విధానాన్ని అమలుచేసి వచ్చే ఫలితాలను బట్టి అన్ని కౌంటర్ల వద్ద ఏర్పాటు చేయాలని టీటీడీ అధికారులు ఆలోచిస్తున్నారు.



## క్రైస్తవుల ఐక్యత రక్షణ సువార్త సభలను విజయవంతం చేయాలి

**ఆళ్లపల్లి, రాజముద్ర న్యూస్: :** ఆళ్లపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శాంతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ఆర్సీఎం చర్చ్ ప్రక్కన ఫిబ్రవరి 14, 15 తేదీలలో రెండు రోజులపాటు క్రైస్తవుల ఐక్యత రక్షణ సువార్త సభలను నిర్వహిస్తున్నట్లు ఫెలోషిప్ నాయకులు తెలిపారు. ఈ సువార్త సభలకు విశాఖపట్నం నుండి "గుడ్ మార్నింగ్ హోలీ స్పిరిట్ ప్రేయర్ టీమ్" దైవజనులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ఆరాధన, స్వస్థత ప్రార్థనలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ఉమ్మడి గుండాల, ఆళ్లపల్లి మండలాల పరిధిలోని క్రైస్తవ భక్తులకు ఆధ్యాత్మిక సందేశం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ వివరాలను పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పరమ అశోక్, డేవిడ్ వసంతరావు, ఆంధ్రయ్య, జయకుమార్ ఇమ్మానుయేల్, ప్రభాకర్, ఆర్సీఎం చర్చ్ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ సిద్దెల జేసు ప్రసాద్, అరుణ్ తెలిపారు. ఈ సమావేశంలో ఏసేపు, సత్యం, జాన్ విక్టర్, ప్రభుదాస్, పాల్రాజ్, కృపావతి, కొర్నెలి, జానుబాబు, సామ్యూల్, కృపాశేఖర్, సీఎస్ఐ పాస్టర్ గుజ్జర్లపూడి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.



## సీఎం కప్ ఫైనల్ గేమ్స్ ముగింపు

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండల కేంద్రం లో జడ్పీహెచ్ఎస్ పాఠశాల గ్రౌండ్లో సోమవారం రోజున సీఎం కప్ ఫుట్బాల్ టోర్నమెంట్ ఫైనల్ గేమ్స్ నిర్వహించారు, ఫైనల్స్ లో బాయ్స్ ఫస్ట్ ప్రైస్ రామారెడ్డి, సెకండ్ ప్రైజ్ కామారెడ్డి, గర్ల్స్ ఫస్ట్ ప్రైస్ కామారెడ్డి, సెకండ్ ప్రైస్ రామారెడ్డి గెలుపొందాయి,గెలుపొందిన టీమ్లకు బహుమతులు ప్రజా ప్రతినిధులు, అధికారులు అందజేశారు, ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి వివేక్‌ను కలిసిన అంబేద్కర్ సంఘం సభ్యులు

**పఠాన్ చెరువు, రాజా ముద్ర న్యూస్:** జాతీయ రహదారి 65 కు అనుకుని ఉన్న రామచంద్రపురం పట్టణానికి సమీపంలోని బీహెచ్ఈఎల్ బస్ డిపోకు వెళ్లే దారికి ముందున ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నారని అంబేద్కర్ సంఘం సభ్యులు రామచంద్రపురం వాసులు ఆరోపిస్తున్నారు. సోమవారం రోజు రాజముద్ర న్యూస్ తో సంఘం సభ్యులు మాట్లాడుతూ, ఈ అంబేద్కర్ విగ్రహం విషయంలో పటాన్చెరువు నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, ఈ అంబేద్కర్ విగ్రహాన్ని ఇక్కడి నుండి తరలించే ప్రయత్నం చేస్తున్నారని, ఎట్టి పరిస్థితులలో ఈ విగ్రహాన్ని ఇక్కడి నుండి తరలిస్తే ఊరుకోబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. రామచంద్రాపురం బస్ స్టాప్ దగ్గరే రోడ్డు పనులను భంగపరచకుండా విగ్రహాన్ని ఉంచుకోవడానికి తగిన స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ, స్వార్థపరమైన వ్యక్తులు ఇప్పుడు అదే తరలణ కుట్రలు పన్నుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి వివేక్ వెంకట స్వామి కి తెలిపినప్పుడు, ఆయన తక్షణమే నేషనల్ హైవేస్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను సంప్రదించారు. ఆ ఇంజనీర్ ఆర్సి పురం బస్ స్టాప్ దగ్గరేనే విగ్రహాన్ని ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ హామీని గౌరవించాలని స్వార్థపరమైన వారి జోక్యాలను నిరోధించాలని అధికారులను కోరుతున్నామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం ప్రజలు అంబేద్కర్ సంఘం సభ్యులు సుంకు వినయ్ కుమార్, సుంకు రాజేందర్, కావలి సంజీవ, సంజీవ కుమార్, సుంకు బాలనరసింహ, సుంకు నరసింహ, కావలి నాగేష్, బోండ్ల దశరథ, రాజేష్, ఎడ్ల రమేష్, సుంకు సాయి, సుంకు సురేందర్, కైతలాపురం రాములు, గంజాయి నర్సింహా., గంజాయి అశోక్ పాల్గొన్నారు.



## ఆలయ నిర్మాణానికి ఆర్థిక చేయూత

**పఠాన్ చెరువు, రాజ ముద్రన్యూస్:** పఠాన్ చెరువు నియోజకవర్గం క్యాసారం గ్రామంలో మల్లన్న స్వామి ఆలయ నిర్మాణానికి సంగారెడ్డి జిల్లా డి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ పర్ష శ్యామ్ రావు 25000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పర్ష శ్యామ్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు ప్రజల ఐక్యతకు, సాంస్కృతిక విలువల పరిరక్షణకు కేంద్రబిందువులుగా ఉంటాయని పేర్కొన్నారు. మల్లన్న ఆలయ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని పర్స శ్యామ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## దొంగలను పట్టుకున్న పోలీసులు



**రామారెడ్డి రాజ ముద్ర న్యూస్ :** శుక్రవారం రోజు రెడ్డిపేట ఎల్లమ్మ టెంపుల్ లో, సింగరాయపల్లి పెద్దమ్మ టెంపుల్ లో మరియు మాచరెడ్డి లోని ఇస్సాయిపేట టెంపుల్ లో దొంగతనం చేసిన డిచ్పల్లి కి చెందిన రుద్రబోయిన గణేష్, కామారెడ్డికి చెందిన నిమ్మ బోయిన సురేష్ లను రామారెడ్డి పోలీసు వారు మరియు మాచరెడ్డి పోలీస్ వారు సంయుక్తంగా చాకచక్యంగా పట్టుకొని వారి వద్ద నుండి రెండు బైకులు మరియు కేసుకు సంబంధించిన నగదును స్వాధీనం చేసుకున్నారు, వీరిద్దరిపై గతంలో దాదాపు 40 కేసుల వరకు ఉన్నాయి. కేసు చేదించిన కామారెడ్డి రూరల్ జ× రామన్ సార్ గారిని రామారెడ్డి ఎస్ఐ రాజశేఖర్, మాచారెడ్డి ఎస్సై అనిల్, రామారెడ్డి సిబ్బంది అయినా శ్రావణ్, రాజు మరియు మాచరెడ్డి సిబ్బంది సిద్ధిరాములను ఏఎస్పీ చైతన్య రెడ్డి అభినందించారు.





## ముగిసిన పీఐబీ హైదరాబాద్ మీడియా ప్రతినిధుల బృందం

# అయిదు రోజుల ఒడిశా పర్యటన

- ఒడిశా అభివృద్ధి పథకాలను పరిశీలించిన మీడియా బృందం
- గవర్నర్‌తో భేటీ అయిన మీడియా ప్రతినిధులు

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** హైదరాబాద్ పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) నేతృత్వంలో తెలంగాణకు చెందిన ఆరుగురు సభ్యుల మీడియా ప్రతినిధుల బృందం ఒడిశాలోని భువనేశ్వర్‌లో అయిదు రోజుల అధికారిక పర్యటనను ముగించుకుంది. భువనేశ్వర్ లోని లోక్ భవన్‌లో ఒడిశా గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటితో జరిగిన మర్యాదపూర్వక భేటీతో ఈ పర్యటన శుక్రవారం నాడు ముగిసింది. కేంద్ర ప్రభుత్వ కీలక అభివృద్ధి కార్యక్రమాలపై మీడియా ప్రతినిధులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు ఒడిశా సాంస్కృతిక వారసత్వం, మౌలిక సదుపాయాల వృద్ధి, పరిశోధనా సంస్థలను గురించి తెలియజేయాలనే లక్ష్యంతో పీఐబీ– హైదరాబాద్ ఈ పర్యటనను ఏర్పాటు చేసింది. మీడియా ప్రతినిధి బృందానికి భువనేశ్వర్ పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీ అఖిల్ కుమార్ మిశ్రా స్వాగతం పలికారు. ఆయన రాష్ట్ర మీడియా రంగం, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాల గురించి వివరించారు. అయిదు రోజుల పర్యటనలో భాగంగా సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వాకల్చర్ (సీఐఎఫ్ఏ), ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటీ) వంటి ప్రముఖ సంస్థలను మీడియా ప్రతినిధుల బృందం సందర్శించింది. వీటితో పాటు కళాభూమి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ మ్యూజియం, లింగరాజ దేవాలయం, ధౌలి శాంతి స్తూపం, యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద అయిన కోణార్క్ సూర్య దేవాలయం, రఘురాజ్



పూర్ సాంస్కృతిక కళల గ్రామం, పూరీలోని జగన్నాథ ఆలయంతో సహా ప్రధాన వారసత్వ, సాంస్కృతిక ప్రాంతాలను సందర్శించిన ప్రతినిధులు.. ఒడిశాకు ఉన్న గొప్ప వాస్తు శిల్ప కళలు, మతపరమైన–సాంస్కృతిక సంప్రదాయాలపై అవగాహన పెంచుకున్నారు. అయిదు రోజుల పర్యటన లోక్ భవన్‌లో ఒడిశా గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటితో జరిగిన మర్యాదపూర్వక భేటీతో ముగిసింది. ఇక్కడ ఉన్నతాధికారులతో సంభాషించిన మీడియా ప్రతినిధులు.. క్షేత్రస్థాయి పర్యటన అనుభవాలను పంచుకున్నారు. ఒడిశా సాధిస్తోన్న స్థిరమైన ఆర్థిక వృద్ధిని, 1.30 లక్షల కోట్ల రూపాయలకు మించిన ప్రధాన మౌలిక సదుపాయాల పెట్టుబడులను, అన్ని జిల్లాలకు రైల్వే అనుసంధానాన్ని కల్పించటం, ఓడరేవులు, రహదారులు, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి గురించి గవర్నర్ ప్రముఖంగా ప్రస్తావించారు. చిరుధాన్యాల ఉత్పత్తి, ఖనిజ ఆధారిత పరిశ్రమల విషయంలో రాష్ట్రం చూపిస్తున్న నాయకత్వాన్ని ప్రధానంగా పేర్కొన్న ఆయన.. ఐఐటీ, ఎయిమ్స్, నైజర్, వరల్డ్ స్కిల్ సెంటర్ వంటి విద్యా, నైపుణ్యాభివృద్ధి సంస్థల వృద్ధి గురించి చెప్పారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో

# జర్నలిస్టుల పాత్ర కీలకం


- ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి
- ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని అభినందించిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, రాజముద్ర న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. సోమవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు పరమేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్. ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు, సీనియర్ జర్నలిస్టులు దొంతుల వెంకటరామిరెడ్డి, కొలనుపాక చంద్రమౌళి,పల్లా మహేందర్ రెడ్డి, కోడికంటి శ్రీనివాస్, ఎస్. ముత్యంరెడ్డి, ఓ.రమేష్, రాజులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర ఎనలేనిదని తెలిపారు. పాత్రికేయులకు తాను ఎల్లప్పుడూ చేదోడువాదోడుగా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ కమిటీకి తన వంతు సహాయక సహకారాలు ఉంటాయని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా వినతిపత్రం

- మీడియా అకాడమీ చైర్మన్‌కు జడ్చర్ల జర్నలిస్ట్ సంఘం డిమాండ్లు
- బస్ పాస్, టోల్ ఫ్రీ ప్రయాణం, 100% సబ్సిడీతో పరికరాలు ఇవ్వాలి : జర్నలిస్టుల ఆకాంక్ష



**ఉప్పల్, రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జడ్చర్ల జర్నలిస్ట్ సంఘం నాయకులు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా బస్ పాస్ సౌకర్యం కల్పించాలని, ప్రతి ప్రింట్ జర్నలిస్టుకు ల్యాప్టాప్, కెమెరా, వీడియో జర్నలిస్టులకు ల్యాప్టాప్‌తో పాటు వీడియో కెమెరాలను 100 శాతం సబ్సిడీపై అందించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే అక్రిడేషన్ కార్డును ఆధారంగా చేసుకొని అన్ని టోల్ గేట్లలో ఫ్రీ టోల్ సౌకర్యం కల్పించడంతో పాటు, ప్రభుత్వ––ప్రైవేట్ అన్ని ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులు సమాజానికి సమాచార వారధిగా పనిచేస్తున్న నేపథ్యంలో వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించాలని నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జడ్చర్ల నుంచి వచ్చే జర్నలిస్టులకు ప్రత్యేకంగా రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించి, పూర్తి స్థాయి సర్టిఫికెట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధికి మీడియా అకాడమీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.డి. సుల్తాన్, ఉపాధ్యక్షుడు శేఖర్ తెలుగు, సంయుక్త కార్యదర్శి మల్లేష్, సీనియర్ పాత్రికేయులు, ఈసీ మెంబర్ తాంబూలం శ్రీనివాస్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.




## రెడ్డి పేటలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహణ

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఎస్ ఎస్ కె కేంద్రం జి జి హెచ్ కామారెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో రామారెడ్డి మండలంలోని రెడ్డి పేట గ్రామంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ నాగులపల్లి రాజేందర్ హాజరై గ్రామస్తులు అందర్నీ కూడా వైద్య సేవల గురించి వివరించి జరిగింది . డాక్టర్ స్నేహ మేడం అందరికీ హెచ్ఐవి, హెచ్బిఎస్, డెంగ్యూ, ఎక్రే , సేవల గురించి వివరించి అవసరమైన వారికి పరీక్షలు చేయడం జరిగింది. దీనిలో భాగంగా సుమారుగా గ్రామంలో ఏలు 70 మందికి రక్త పరీక్షలు 164 మందికి నిర్వహించి వారికి రిపోర్టులు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి రెడ్డి పేట, రామారెడ్డి మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ సురేష్,౼ాౡ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ గార్లు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది వీరందరూ గ్రామంలోని ప్రజలకు వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని పైన తెలిపిన టెస్టులని వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## ఘనంగా పీఆర్టీయు మండల సర్వసభ్య సమావేశం

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఉపాధ్యాయ సర్వీస్ సమస్యలు,పీఆర్సీ బకాయి బిల్లుల చెల్లింపు వంటి అంశాల్లో పిఆర్టియు కీలక పాత్ర పోషించిందని ఆ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కట్టా శేఖర్,ఆర్.రంగారావు తెలిపారు.కూసుమంచి మండల కేంద్రంలో పీఆర్టీయు మండల అధ్యక్షుడు శీలం ఆంజనేయులు అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా హాజరైన వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధనలో సంఘం ఐక్యతే ప్రధాన బలమని తెలిపారు.ముఖ్యంగా ఆన్‌లైన్ భారం,బదిలీలు,పదోన్నతుల్లో జాప్యం, ఇంక్రిమెంట్లు,పీఆర్సీ సంబంధిత అంశాలు,పాఠశాలల్లో మౌలిక వసతుల లోపం,అధిక పనిభారం వంటి సమస్యలను ప్రస్తావిస్తూ,వీటిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్టియు సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు.ఈ సమావేశంలో పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి ఎం.సతీష్,మాసపత్రిక ఎడిటోరియల్ సభ్యులు జివి.రమణ,జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కేవీ.కృష్ణారావు,సాద వెంకన్న,రాజశేఖర్,మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ,ఆనంద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య,జిల్లా ఉపాధ్యక్షులు శోభన్ బాబు,సర్వర్ మియా తదితరులు పాల్గొన్నారు.

# 11వ తేదీ తర్వాత మీ సంగతి తేలుస్తా..!

- చందాలు దందాలు చేస్తే.. కింద పడుద్ది జాగ్రత్త
- కారుకూతలు కూస్తే బొక్కలోకి పంపడం ఖాయం
- ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచార ముగింపు సభలో మంత్రి పొంగులేటి స్ట్రాంగ్ వార్నింగ్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రాజకీయాల ముసుగులో అరాచకాలు చేస్తామన్నా,ఫోన్లలో బెదిరింపులకు దిగినా సహించేది లేదని,11వ తేదీ ఎన్నికలు ముగియనివ్వండి.హద్దులు దాటిన ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తా,చందాలు,దందాలు చేస్తే కింద పడుద్ది జాగ్రత్త! తింగరి వేషాలు వేస్తే ఊరుకోం..చట్టప్రకారం మీ అందరినీ బొక్కలో వేయించడం ఖాయమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యర్థులను హెచ్చరించారు.ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రచార పర్వంలో ప్రత్యర్థుల తీరుపై మంత్రి నిప్పులు చెరిగారు.ఎవరైనా కారుకూతలు కూస్తే చట్టరీత్యా ఉక్కుపాదం మోపుతాం,మీ బెదిరింపులకు ఇక్కడ ఎవరూ భయపడరని,మీ దందాలకు,దౌర్జన్యాలకు ప్రజలు ఈ ఎన్నికలతో ఫుల్ స్టాప్ పెట్టబోతున్నారన్నారు.ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలి.అశాంతి సృష్టించాలని చూస్తే ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.



### అధికారం లేని మీరు అభివృద్ధి ఎలా చేస్తారు?

రంగురంగుల కండువాలు వేసుకుని వస్తున్న నాయకులను మంత్రి సూటిగా నిలదీశారు.అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వ సాయం ఉండాలి. అధికారంలో ఉన్న మేమే పనులు చేయగలం.ఏ అధికారం ఉందని మీరు మేలు చేస్తామంటూ ప్రజల వద్దకు వస్తున్నారు.పదేళ్లు అధికారంలో ఉన్న ఆ దొరలకు పేదలకు ఇల్లు ఇవ్వాలనే జ్ఞానం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్త రేషన్ కార్డులు,హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు వంటి ఎన్నో సంక్షేమ ఫలాలను అందించామని గుర్తుచేశారు.

### ఏప్రిల్‌లో 'ఇందిరమ్మ' ఇళ్లు..

వచ్చే ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని మంత్రి పొంగులేటి ప్రకటించారు.ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చే బాధ్యత నాదే.ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.మున్నేరు వరద బాధితులకు అండగా ఉన్నామని,వచ్చే వర్షాకాలం నాటికి రిటైనింగ్ వాల్ పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.సభ అనంతరం వరంగల్ క్రాస్ రోడ్డు నుంచి నాయుడు పేట సర్కిల్ వరకు వేలాది మందితో జరిగిన భారీ ర్యాలీ నిర్వహించి ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ట్రంప్ బెదిరింపులు.. 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్..



**ఇరాన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరాన్‌కు చేరువలో అమెరికా తన యుద్ధ నౌకలను మోహరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ 37 ఏళ్ల సంప్రదాయానికి బ్రేక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 8న ఎయిర్‌ఫోర్స్ కమాండర్లతో ఏటా ఆయన భేటీ అవుతుంటారు. ఈసారి ఆ సమావేశంలో ఆయన పాల్గొనలేదని ఇరాన్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. 1989లో సుప్రీంలీడర్‌గా బాధ్యతలు అందుకున్న దగ్గరినుంచి చివరకు కరోనా సమయంలో కూడా ఈ వార్షిక సమావేశాన్ని ఆయన మిస్ చేయకపోవడం గమనార్హం.



## 'మమ్మల్ని భయపెట్టలేరు'..

### యురేనియం శుద్ధిపై తగ్గేదే లేదన్న ఇరాన్

**ఇరాన్ :** అమెరికాతో అణు చర్చలు జరుగుతోన్న వేళ ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. యురేనియం శుద్ధిపై తాము వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. తమను ఎవరూ భయపెట్టలేరంటూ అగ్రరాజ్యంపై కవ్వింపులకు పాల్పడింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి వ్యాఖ్యలు చేశారు. "అమెరికాపై మాకు పెద్దగా నమ్మకం లేదు. యురేనియం శుద్ధిపై మేమెందుకు వెనక్కి తగ్గాలి. ఒకవేళ మాపై యుద్ధం ప్రకటించినా మేం దాన్ని వదిలేయబోం. ఎందుకంటే మమ్మల్ని శాసించే హక్కు ఎవరికీ లేదు. ఈ ప్రాంతంలో వారి (అమెరికాను ఉద్దేశిస్తూ) సైనిక మోహరింపు మమ్మల్ని భయపెట్టలేదు" అని అరాఘ్చి వ్యాఖ్యానించారు. ఇక, అమెరికాతో చర్చల గురించి తమ వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలైన చైనా, రష్యాను కూడా సంప్రదిస్తున్నట్లు ఇరాన్ మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు వేసేందుకే ఇరు దేశాలు ఈ చర్చల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే, ఇదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తమ సైనిక మోహరింపును పెంచుతోంది. అణు ప్రణాళికలకు సంబంధించి ఇరాన్‌పై ఒత్తిడి పెంచే ఉద్దేశంతోనే ఈ మోహరింపులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఒకవేళ చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామని అగ్రరాజ్యం సంకేతాలిచ్చింది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి.





## హిమంత వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకెళ్తాం: గౌరవ్ గొగోయ్

**న్యూఢిల్లీ :** తమ కుటుంబానికి పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్‌తో సంబంధాలు ఉన్నాయని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ స్పందించారు. 2013లో తన పాక్ పర్యటనపై సిట్ అధికారులు తనను ఎన్నడూ ప్రశ్నించలేదన్నారు. ప్రజల మధ్యలో మతపరమైన విద్వేషాలు సృష్టించేందుకు హిమంత ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. తన భార్య, మైనర్ పిల్లలపై అసంబద్ధమైన ఆరోపణలు చేసినందుకుగాను అస్సాం సీఎం వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకు వెళ్తామన్నారు. ఆయన మాట్లాడిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గతంలో తన భార్య పాకిస్థాన్‌కు వెళ్లడం నిజమేనని..కానీ వృత్తి సంబంధమైన పనిలో భాగంగా అక్కడికి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. ఆమెతో పాటు తాను కూడా 10 రోజుల పాటు పాక్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఈ పర్యటన సమయంలో తాను అక్కడ ఎవరినీ కలవలేదన్నారు. ఆ విషయంపై హిమంత బిశ్వశర్మ అర్థం లేని, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.



## ఢిల్లీలో స్కూళ్లకు బాంబు బెదిరింపులు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపాయి. నగరాన్ని ఖలిస్థానీగా మారుస్తామంటూ దాదాపు తొమ్మిది పాఠశాలలకు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యలో భాగంగా విద్యార్థులను బయటకు పంపేశారు. 2001లో పార్లమెంట్‌పై దాడి సూత్రధారి అఫ్జల్‌గురుకు గుర్తుగా దిల్లీ, పంజాబ్ నగరాలు ఖలిస్థానీగా మారుతాయంటూ స్కూళ్లకు ఈ-మెయిల్స్ వచ్చాయి. అంతేకాకుండా ఈనెల 13న పార్లమెంట్‌లోనూ పేలుళ్లకు పాల్పడతామంటూ అందులో పేర్కొనడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబు నిర్వీర్యదళం సభ్యులు ఆయా స్కూళ్లకు వెళ్లి ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతానికి పాఠశాల ఆవరణాల్లో ఎలాంటి అనుమానిత పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు. దీనిపై మరింత దర్యాప్తు కొనసాగుతుందన్నారు.


## స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాల అవిశ్వాస తీర్మానం..?



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదంతో ఉభయ సభల కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడనివ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చేందుకు విపక్షాలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ కథనం వెల్లడించింది. అవిశ్వాస తీర్మానం తెచ్చేందుకు ఇప్పటికే విపక్షాలు నోటీసులిచ్చినట్లు సమాచారం. త్వరలోనే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై స్పందించేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. తమ చర్య కోసం వేచిచూడాలని పేర్కొంది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రసంగించేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీని స్పీకర్ అనుమతించలేదని ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణ. ఇక, కాంగ్రెస్ ఎంపీలు, మహిళా నేతలను కించపరిచేలా మాట్లాడిన భాజపా ఎంపీ నిషికాంత్ దూబేపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందుకే ఈ అవిశ్వాస తీర్మానం తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తీర్మానం తీసుకురావాలంటే కనీసం 100 మంది ఎంపీల సంతకాలు అవసరం. ప్రస్తుతం విపక్షాలు ఆ సంతకాల సేకరణలో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీలు పాల్గొన్నట్లు తెలిపాయి. మరోవైపు, పార్లమెంట్‌లో సోమవారం కూడా సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. విపక్షాల నిరసనలతో లోక్‌సభ పలుమార్లు వాయిదా పడింది. అటు రాజ్యసభలో ఖర్గే ప్రసంగానికి అనుమతి లభించకపోవడంతో విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి.


## గాజియాబాద్ బాలికల ఆత్మహత్య కేసు

### ముగ్గురు భార్యల 'కథ'తో గందరగోళం



**ఉత్తరప్రదేశ్ :** ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్న కేసులో కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. బాధితుల తండ్రి చేతన్ కుమార్ చెబుతున్న సమాధానాలు వాస్తవాలకు భిన్నంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. తాను వివాహం చేసుకున్న మహిళలు ముగ్గురూ అక్కాచెల్లెళ్లు అని అతడు మొదట పేర్కొన్నాడని తెలిపారు. అయితే దర్యాప్తులో చేతన్ భార్యలు ఒకే కుటుంబానికి చెందినవారు కాదని.. మూడో భార్య టీనా 2018లో అతడి వద్ద ఉద్యోగినిగా పని చేసినట్లు తేలిందన్నారు. అనంతరం వారు వివాహం చేసుకున్నారని.. అప్పటికే చేతన్‌కు రెండు వివాహాలు జరిగాయని అన్నారు. 2010లో సుజాతను వివాహం చేసుకున్నానని.. తమకు పిల్లలు పుట్టకపోవడంతో 2013లో హీనాను వివాహం చేసుకున్నట్లు అతడు విచారణలో పేర్కొన్నాడు. అయితే మొదటి భార్య కుమార్తెకు ప్రస్తుతం 16 ఏళ్ల వయసు ఉండడంతో అతడు చెబుతున్న మాటలపై అధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. దీంతో వివాహ పత్రాల ఆధారంగా ముగ్గురితో చేతన్‌కు ఏ సంవత్సరాల్లో వివాహం జరిగిందనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా, 2015లో చేతన్ సహజీవన భాగస్వామి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో దర్యాప్తు చేస్తున్నకొద్దీ చేతన్ వివాహాల విషయంలో కొత్త విషయాలు బయటకు వస్తుండడంతో విచారణలో గందరగోళం నెలకొంటుందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు వారు ట్రిబుల్ బెడ్‌రూం ఫ్లాట్‌లో నివసిస్తున్నప్పటికీ ఘటన జరిగిన సమయంలో అందరూ ఒకే గదిలో నిద్రించడం అనుమానాస్పదంగా ఉందన్నారు. ఆర్థిక సమస్యలు, అప్పుల కారణంగా కొన్నేళ్ల క్రితమే తమ పిల్లలను స్కూల్ మానిపించినట్లు చేతన్ చెప్పడం, వారు ఆత్మహత్య చేసుకోవడానికి కొన్ని రోజుల ముందు వారి ఫోన్లను విక్రయించడం కూడా పలు అనుమానాలకు దారితీస్తోంది. దీంతో ఆ ఫోన్‌లలో ఉన్న సమాచారాన్ని తెలుసుకునేందుకు వాటి ఐఎంఈఐ నంబర్ల సాయంతో రికవరీ చేస్తున్నట్లు తెలిపారు.

## ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్



**న్యూఢిల్లీ :** నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన దగ్గు, గొంతు నొప్పితో బాధపడుతున్న ఆయనను పుణెలోని రుబీ హాల్ ఆసుపత్రికి తరలించినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. శరద్ పవార్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలియాల్సి ఉంది. కొన్ని రోజులుగా పవార్ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం పుణెకు తరలించామన్నారు. ఇటీవల శరద్ పవార్ సోదరుడి కుమారుడు అజిత్ పవార్ విమాన ప్రమాదంలో కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అజిత్ కుటుంబం నిర్వహించిన కర్మకాండలకు కూడా శరద్ పవార్ హాజరుకాలేదు. గతంలో ఆయన నోటి క్యాన్సర్ బారిన పడ్డారు. పలు శస్త్ర చికిత్సల అనంతరం దాన్నుంచి కోలుకున్నారు.



## రూ.54వేల కోట్లు కొల్లగొట్టారు

### డిజిటల్ మోసాలపై సుప్రీం

**న్యూఢిల్లీ :** దేశంలో డిజిటల్ అరెస్టు మోసాలు పెరిగిపోవడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుల్లో సైబర్ నేరగాళ్లు రూ.54వేల కోట్లు కొల్లగొట్టారని, ఇది భారీ దోపిడీ అంటూ ఆందోళన వ్యక్తంచేసింది. దోచుకున్న సొమ్ము చిన్నరాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువగా ఉందని పేర్కొంది. ఈ మోసాలపై అత్యున్నత న్యాయస్థానంలో తాజాగా విచారణ జరిగింది. వాటికి చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలికమ్యూనికేషన్ విభాగం సంప్రదింపులతో నిర్ణీత ప్రమాణాల కార్యాచరణను రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. అందుకు నాలుగువారాల గడువు ఇచ్చింది. ఈ నేరాలకు కొందరు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం, కుట్ర కూడా కారణం కావొచ్చని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆర్‌బీఐ, బ్యాంకుల నుంచి సకాలంలో చర్యలు ఉండాలని ఆదేశించింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో పరిహారం విషయమై ఆర్‌బీఐ, టెలికమ్యూనికేషన్ విభాగం, ఇతర విభాగాలు సంయుక్తంగా సమావేశంకావాలని సూచించింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఇదిలా ఉంటే.. డిజిటల్ ఆర్థిక మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, బ్యాంకింగ్ వినియోగదార్లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ఉపశమనాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒక మోసపూరిత లావాదేవీకి రూ.25,000 వరకు పరిహారాన్ని అందివ్వనుంది. మోసగాళ్లకు వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) ఇవ్వడం ద్వారా, డబ్బులు పోగొట్టుకున్న వారికీ ఈ పరిహారం అందుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అయితే ఆ లావాదేవీలు దురుద్దేశంతో కూడుకున్నవి కాకుండా ఉండాలన్నారు.

## రాజకీయంగా దెబ్బతీసే కుట్ర

### మహిళతో సంబంధంపై ఆర్జెడి నేత తేజ్‌ప్రతాప్

**పాట్నా, ఫిబ్రవరి 9 :** అనుష్కా యాదవ్ అనే మహిళతో తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు, ఇప్పుడు ఆమెతో తాను కుమార్తెను కన్నట్లు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌పెద్ద కుమారుడు, ఆర్జేడీ బహిష్కృత నాయకుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తెలిపారు. ఆర్జేడీ నేతలు తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అనుష్కా యాదవ్ అనే మహిళతో తనకు సంబంధాలు ఉన్నట్లు వస్తున్న వార్తలపై తేజ్ ప్రతాప్ అభ్యంతరం తెలిపారు. ఆధారరహితంగా వదంతులు వ్యాప్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కుట్ర వెనక మహువా నియోజకవర్గ ఆర్జేడీ ఎమ్మెల్యే ముఖేశ్ రోషన్ ఉన్నాడన్నారు. తన సోదరుడు తేజస్వీ యాదవ్‌కు సన్నిహితులైన పలువురు ఆర్జేడీ నేతలు తన రాజకీయ జీవితాన్ని దెబ్బతీయడానికి కుట్ర పన్నుతున్నారని చెప్పారు. అందులో భాగంగానే ఓ మహిళతో తనకు అక్రమ సంబంధం ఉన్నట్లు తప్పుడు వార్తలు సృష్టించి పార్టీ నుంచి బహిష్కరించేలా చేశారని తేజ్ ప్రతాప్ ఆరోపించారు. ఇప్పుడు ఆ మహిళకు కుమార్తె పుట్టినట్లు వస్తున్న వార్తలు తనను తీవ్ర వేదనకు గురిచేస్తున్నాయన్నారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్తానని తెలిపారు. తేజ్ ప్రతాప్ 2018లో బీహార్ మాజీ ముఖ్యమంత్రి దరోగా రాయ్ మనవరాలు ఐశ్వర్యను వివాహం చేసుకున్నారు. అయితే వీరి మధ్య విభేదాలు రావడంతో కొన్నేళ్లుగా విడిగా ఉంటున్నారు. ఇటీవల జరిగిన బీహార్ ఎన్నికల సమయంలో తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో ఆయన ఒక మహిళతో ఉన్న ఫొటో ప్రత్యక్షమైంది. ఆమె పేరు అనుష్క యాదవ్ అని, గత 12 ఏళ్లుగా తాము రిలేషన్‌లో ఉన్నట్లు ఆ పోస్టులో ఉండడంతో అది అప్పట్లో వైరల్‌గా మారింది. దీనిపై తేజ్‌ప్రతాప్ స్పందిస్తూ.. ఎవరో తన సోషల్ మీడియా ఖాతాను హ్యాక్ చేశారని అన్నారు. ఆ పోస్టులోని ఫొటో సైతం ఎడిట్ చేసినదేనని చెప్పారు. ఈ క్రమంలో ఇప్పుడు వారికి కుమార్తె పుట్టినట్లు వార్తలు రావడం గమనార్హం.

# తమిళనాడులో టాటా మోటార్స్ ప్లాంట్ ప్రారంభం

**దిల్లీ :** ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ తమిళనాడులో కొత్త తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. రాణిపేట జిల్లాలోని పాణపక్కంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ పాల్గొన్నారు. రాబోయే 5-7 ఏళ్లలో ఈ ప్లాంట్ ద్వారా 2.5 లక్షల వాహనాల ఉత్పత్తి సామర్థ్యాన్ని అందుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ప్లాంటుపై రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు టాటా మోటార్స్ తెలిపింది. టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్‌తో పాటు, దాని అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్‌కు చెందిన కార్లనూ ఇక్కడే తయారుచేస్తారు. దశలవారీగా ఉత్పత్తి కార్యకలాపాలను పెంచనున్నారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లకు ఇక్కడి నుంచే సరఫరా చేస్తారు. ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా స్థానికంగా రూపొందిన రేంజ్ రోవర్ ఎవోక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 5వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తమిళనాడుతో టాటా గ్రూప్‌నకు సుదీర్ఘ అనుబంధం ఉందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ఉద్యోగావకాశాలు కల్పించే పరిశ్రమలకు ప్రోత్సాహం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా పరిశ్రమలో తయారైన ల్యాండ్ రోవర్ కారును స్టాలిన్ స్వయంగా నడిపారు.








# బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలు

బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇటీవల భారీగా పతనం అయిన ఈ రెండు లోహాల ధరలు మళ్లీ పైకెళుతున్నాయి. ఫ్యూచర్స్ మార్కెట్‌లో వెండి దాదాపు 5 శాతం మేర పెరిగింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో వెండి కిలో మార్చి నెల కాంట్రాక్ట్ 4.74 శాతం మేర పెరిగి రూ.2,61,745కి చేరింది. అంటే రూ.11 వేలు పెరిగింది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర ఏప్రిల్ కాంట్రాక్ట్ 1.3 శాతం పెరిగి రూ.1,57,540కి చేరింది. అంటే దాదాపు రూ.2 వేలు పెరిగింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ మళ్లీ 5 వేల డాలర్ల మార్కు దాటింది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఔన్సు పసిడి ధర 5004 పలుకుతుండగా.. వెండి ఔన్సు 81 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ వీటి ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో రూ.1.60 లక్షలు పలుకుతుండగా.. వెండి ధర రూ.2.70 లక్షల పైనే కొనసాగుతోంది. బంగారం, వెండిలో ఇటీవల భారీ కరెక్షన్ కారణంగా ధరలు దిగొచ్చాయి. వెండి ఏకంగా సగం వరకు పతనం అయ్యింది. దీంతో కనిష్ఠాల వద్ద ట్రేడర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు లభిస్తోందని అనలిస్టులు పేర్కొంటున్నారు. డాలర్ విలువ పతనం కావడమూ మరో కారణం. మరోవైపు చైనా సెంట్రల్ బ్యాంక్ వరుసగా 15వ నెల కూడా పెద్ద మొత్తంలో పసిడిని కొనుగోలు చేయడంతో బంగారానికి డిమాండ్ పెరిగింది. ఈ వారం వెలువడనున్న అమెరికా ఉద్యోగ, ద్రవ్యోల్బణ గణాంకాలు ఫెడరల్ రిజర్వ్ పరపతి విధాన నిర్ణయాలు.. బంగారం, వెండి ధరలను ప్రభావితం చేయొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రెండు లోహాల్లో ఇటీవల భారీస్థాయిలో కుదుపు రావడానికి చైనా ట్రేడర్ల స్పెక్యులేటివ్ ట్రేడింగే కారణమని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు.



# సూర్యకుమార్ వల్ల నా పని ఈజీ అవుతోంది : గౌతమ్ గంభీర్

టీమ్ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసలు కురిపించాడు. ఆటగాళ్లతో ఎంతో కలుపుగోలుగా ఉంటాడని, దీంతో పొట్టి ఫార్మాట్‌లో కోచ్‌గా తన పనిని చాలా సులభతరం చేస్తున్నాడని పేర్కొన్నాడు. "సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన కెప్టెన్. బ్యాటర్‌గా తనదైన షాట్లతో విధ్వంసం సృష్టించే ఇతను సారథిగా అదరగొడుతున్నాడు. సహచర ఆటగాళ్లతో మంచి సంబంధాలను కలిగి ఉంటాడు. వారితో చక్కగా మాట్లాడతాడు. మైదానంలో ప్రశాంతంగా ఉంటూ తోటి ఆటగాళ్లకు మద్దతు ఇస్తున్నాడు. సూర్య జట్టు వాతావరణాన్ని చాలా ప్రశాంతంగా ఉంచడటంతో కోచ్‌గా నా పని మరింత సులభతరం అవుతోంది. ఆటగాడిగా సూర్య కొన్నిసార్లు తప్పులు చేయొచ్చు. కెప్టెన్‌గా మాత్రం అన్ని విభాగాల్లో సమర్థుడు. అలాంటి వ్యక్తి భారత జట్టును నడిపించడం గొప్ప విషయం. సూర్య జట్టు కోసం సరైన నిర్ణయాలు తీసుకుంటాడు" అని గంభీర్ ప్రశంసించాడు. టీ20 ప్రపంచ కప్‌లో యూఎస్ఏతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ (84; 49 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టీమ్ఇండియా ఒక దశలో 13 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 77 పరుగులతో కష్టాల్లో పడింది. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో సూర్య ఎదురుదాడికి దిగి భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. దీంతో భారత్ 161/9తో ఇన్నింగ్స్‌ను ముగించింది. యూఎస్ఏ 132/8కి పరిమితమైంది.

# హర్షిత్ రాణాకు సర్జరీ



టీ20 ప్రపంచ కప్ 2026లో ఆడాలని కలలు కన్న టీమ్ఇండియా ఫాస్ట్‌బౌలర్ హర్షిత్ రాణా గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరమైన సంగతి తెలిసిందే. వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు సౌతాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో హర్షిత్ మోకాలికి గాయమైంది. దీంతో అతడు టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. హర్షిత్ స్థానంలో మహ్మద్ సిరాజ్‌కు చోటు కల్పించారు. తాజాగా రాణాకు శస్త్రచికిత్స చేశారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి హర్షిత్ ఇన్‌స్టా వేదికగా అప్‌డేట్ ఇచ్చాడు. ఆస్పత్రిలో బెడ్‌పై ఉన్న ఫొటో షేర్ చేస్తూ "సర్జరీ విజయవంతంగా పూర్తయింది. ఇప్పుడు కోలుకోవడం, నేను ఇష్టపడేదాన్ని తిరిగి పొందడంపై దృష్టిపెట్టాను" అని పోస్టు పెట్టాడు. టీ20 ప్రపంచకప్‌లో భారత్ విషయానికొస్తే.. యూఎస్ఏతో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమ్ఇండియా 29 పరుగుల తేడాతో గెలిచింది. టీమ్ఇండియా తదుపరి మ్యాచ్‌లో నమీబియాతో ఫిబ్రవరి 12న దిల్లీలో తలపడనుంది.



# భారత్‌తో మ్యాచ్ ఓటమి తర్వాత.. అమెరికా జట్టుకు ట్రంప్ మెసేజ్

టీ20 వరల్డ్ కప్‌లో పోటీపడుతోన్న తమ దేశ టీమ్‌కు మద్దతుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సందేశం పంపారు. "భారతదేశంలో క్రికెట్ వరల్డ్ కప్ జరుగుతోందని నాకు ఇప్పుడే తెలిసింది. టీమ్ యూఎస్ఏ మెరుగైన ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నాను. మనది బలమైన జట్టు. మీరు విజయం సాధించాలని దేశం మొత్తం కోరుకుంటోంది" అని ట్రంప్ మెసేజ్ చేశారు. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా శనివారం రాత్రి భారత్, యూఎస్ఏ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌తో ఆతిథ్య భారత్ శుభారంభం చేసింది. ముంబయి వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. చివరివరకు పోరాడినా యూఎస్ఏ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. అయితే ఈ మ్యాచ్ అయిన తర్వాత ట్రంప్ నుంచి ఆ మెసేజ్ రావడం గమనార్హం. కాగా.. ట్రంప్ పోస్టుపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పందించారు. "మీ మద్దతుకు థాంక్యూ ప్రెసిడెంట్" అని బదులిచ్చారు.

## ఇటలీపై స్కాట్లాండ్

# ఘన విజయం

**కోల్‌కతా:** టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 208 పరుగుల లక్ష్యఛేదనలో ఇటలీ.. 16.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. బెన్ మనెంటి (52; 31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), హెన్రీ మానెంటి (37; 25 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), స్మట్స్ (22; 11 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో మైకేల్ లీస్క్ 4, మార్క్ వాట్ 2, బ్రాడ్ క్యూరీ, బ్రాడ్ వీల్, డేవిడ్సన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. 12 ఓవర్లకు 113/3తో ఉన్న ఇటలీ.. వరుసగా వికెట్లు కోల్పోయి కుప్పకూలింది. ఆ జట్టు 21 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లను కోల్పోయింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన స్కాట్లాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జ్ మున్సే (84; 54 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో మెరిశాడు. మరో ఓపెనర్ మైకేల్ జోన్స్ (37; 30 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించాడు. ఈ జోడీ తొలి వికెట్‌కు 126 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. తర్వాత వచ్చిన బ్రాండన్ మెక్‌ముల్లెన్ (41; 18 బంతుల్లో 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. రిచీ బెరింగ్టన్ (15) పరుగులు చేశాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో మైకేల్ లీస్క్ (22; 5 బంతుల్లో) వరుసగా 4, 2, 4, 6, 6 బాదేయడంతో



స్కోరు 200 దాటింది. ఇటలీ బౌలర్లలో అలీ హసన్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా, స్మట్స్ తలో వికెట్ సాధించారు.

## భారత్‌తో మ్యాచ్‌పై

# పాక్‌కు డెడ్‌లైన్



టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇది ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. భారత్, పాక్ మ్యాచ్‌ను ఎలాగైనా నిర్వహించాలని పట్టుదలతో ఉన్న ఐసీసీ.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుతో సంప్రదింపులు జరుపుతోంది. లాహోర్‌లో ఆదివారం పీసీబీ ఛైర్మన్ మోసిన్ నక్వీ, ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖవాజా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాం సమావేశమయ్యారు. ఐదు గంటలకు పైగా ఈ చర్చలు సాగాయి. ఐసీసీ ముందు పీసీబీ మూడు డిమాండ్లు ఉంచినట్లు సమాచారం. ఇందులో మొదటి బంగ్లాదేశ్‌లో క్రికెట్ అభివృద్ధి కోసం ఐసీసీ నుంచి మరిన్ని నిధులు ఇవ్వడం. రెండోది టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొననప్పటికీ బంగ్లాదేశ్‌కు పార్టిసిపేషన్ ఫీజు మంజూరు చేయడం. మూడోది భవిష్యత్‌లో బంగ్లాదేశ్‌కు ఐసీసీ ఈవెంట్ ఆతిథ్య హక్కులు ఇవ్వడం. ఈ క్రమంలో భారత్‌తో మ్యాచ్ ఆడే విషయంపై పాక్‌కు ఐసీసీ 24 గంటల డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తోంది. పీసీబీ తుది నిర్ణయం ప్రకటించే ముందు ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సోమవారం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను మోసిన్ నక్వీ కలిసే అవకాశముంది. పాక్ మనసు మార్చుకొని మ్యాచ్ ఆడేందుకు సుముఖత వ్యక్తం చేస్తుందని ఐసీసీ అధికారులు ఆశిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం భారత్, పాక్ మ్యాచ్ ఈనెల 15న కొలంబోలో జరగాల్సిఉంది. భద్రతా కారణాలతో భారత్‌లో ఆడటానికి బంగ్లాదేశ్ నిరాకరించింది. తర్వాత బంగ్లాను టోర్నీ నుంచి తప్పించి స్కాట్లాండ్‌కు అవకాశమిచ్చారు. బంగ్లాదేశ్‌కు మద్దతుగా భారత్ మ్యాచ్‌ను పాక్ బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. పీసీబీతో ఐసీసీ చర్చలు జరుపుతున్న నేపథ్యంలో బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ అంశంపై స్పందించారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. "ఈ అంశాలన్నింటిపై నేను గానీ, బీసీసీఐ గానీ ఎలాంటి కామెంట్ చేయం. ఈ విషయాన్ని పూర్తిగా ఐసీసీకి అప్పగించాం. వారు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటాం" అని శుక్లా పేర్కొన్నారు.

# ఒక్క పరుగు తేడాతో ట్రిపుల్ సెంచరీ మిస్..

ఓ బ్యాటర్ ఒక్క పరుగు తేడాతో ట్రిపుల్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. రంజీ ట్రోఫీలో ఆంధ్రతో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్‌లో తొలి ఇన్నింగ్స్‌లో బెంగాల్ బ్యాటర్ సుదీప్ కుమార్ ఘరామి (299; 596 బంతుల్లో 31 ఫోర్లు, 6 సిక్స్‌లు) త్రుటిలో ట్రిపుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. షేక్ రషీద్ బౌలింగ్‌లో సుదీప్ వెనుదిరిగాడు. ఈ బ్యాటర్ తీవ్ర నిరాశతో పెవిలియన్‌కు చేరుతున్న క్రమంలో ఆంధ్ర ఆటగాళ్లు బాధపడకు అంటూ ఓదార్చారు. మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చిన ప్రేక్షకులు, సహచర ఆటగాళ్లు సుదీప్ కుమార్ ఘరామికి స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో 299 పరుగుల వద్ద వెనుదిరిగిన తొలి భారత బ్యాటర్‌గా సుదీప్ నిలిచాడు. ఓవరాల్‌గా మూడోవాడు. న్యూజిలాండ్‌కు చెందిన మార్టిన్ క్రోవ్.. 1991లో శ్రీలంకతో టెస్టు మ్యాచ్‌లో 299 రన్స్ వద్ద ఔటయ్యాడు. గ్లామోర్గాన్‌కు



చెందిన మైకేల్ పావెల్ కూడా 2006లో గ్లౌసెస్టర్‌షైర్‌పై 299 రన్స్ వద్ద వెనుదిరిగాడు.



# లాభాలతో ముగిసిన సూచీలు

**ముంబాయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. భారత్-అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌కు సంబంధించి శుక్రవారం ఫ్రేమ్‌వర్క్ ఖరారరైన నేపథ్యంలో పాజిటివ్ సెంటిమెంట్ కొనసాగింది. త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టిన నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు దాదాపు 8 శాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లు లాభపడింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.473 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 84,177.51 పాయింట్ల (క్రితం ముగింపు 83,580.40) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,314.68 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 485.35 పాయింట్ల లాభంతో 84,065.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 173.60 పాయింట్ల లాభంతో 25,867.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎస్‌బీఐ, టైటాన్, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎటెర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టపోయాయి.




# ఏఐ సమ్మిట్ ఎఫెక్ట్..

## దిల్లీ హోటల్‌లో లగ్జరీ రూమ్ రూ.30 లక్షలు..

**న్యూఢిల్లీ :** దిల్లీలో హోటల్ గదుల బుకింగ్స్ భారీగా పెరిగాయి. సూపర్ లగ్జరీ రూమ్‌ల ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణ రోజుల్లో రూ.2లక్షలు ఉండే లగ్జరీ సూట్ ధర.. ఇప్పుడు రూ.32 లక్షల వరకు పెరగడం గమనార్హం. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు దేశ రాజధాని ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఫిబ్రవరి 19-20 తేదీల్లో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరగనుంది. దీనికి టెక్ లీడర్లు సుందర్ పిచాయ్ (గూగుల్), శామ్ ఆల్ట్‌మన్ (ఓపెన్ ఏఐ) హాజరుకానుండటం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఈ సదస్సులో హాజరయ్యేందుకు దేశ విదేశాల ప్రతినిధులు ఆసక్తి చూపుతున్నారు. దాంతో దిల్లీ హోటల్ గదుల ధరలు అమాంతం పెరిగాయి. ఒక్క రోజుకు తాజ్ ప్యాలెస్‌లోని గార్డెన్ లగ్జరీ సూట్ ధర అన్ని ట్యాక్సులతో కలుపుకొని రూ.32 లక్షలకు చేరింది. సాధారణ రోజుల్లో అది రూ.2 లక్షలకే లభిస్తుంది. హయత్ యాజమాన్యంలోని అందాజ్ దిల్లీ హోటల్‌లోని సిగ్నేచర్ సూట్ ధర రూ.3.86 లక్షలుగా ఉందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ హైప్రొఫైల్ ఈవెంట్ కారణంగా రూమ్‌ల ధరలు రెండు నుంచి మూడు రెట్లు అదనంగా ఉన్నాయని ఐబిస్‌డఐబిస్ ఇండియా కమర్షియల్ హెడ్ అనిమేశ్ కుమార్ వెల్లడించారు. ఆ తేదీల్లో తమ హోటల్‌లో అన్ని గదులు దాదాపు బుక్ అయ్యాయని లలిత్ సూరి హాస్పిటాలిటీ గ్రూప్ హోటల్ మేనేజర్ వినీత్ కపూర్ వెల్లడించారు. తాము ఏడుగురు అంతర్జాతీయ నాయకులు, ప్రతినిధులకు ఆతిథ్యం ఇస్తున్నామని చెప్పారు. తమ అతిథులకు తగ్గట్టుగా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, స్థానిక పర్యాటక ప్రదేశాలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తున్నామని ఏరోస్ హోటల్ యాజమాన్యం పేర్కొంది. ఈ సమ్మిట్ కోసం సుమారు 100 దేశాల నుంచి 35వేల మంది ప్రతినిధులు రానున్నారు. ఇప్పటివరకు నాలుగుసార్లు పలు దేశాల్లో ఈ సదస్సు జరిగింది. వాటన్నింటికంటే భారత్‌లో జరిగే ఈవెంటే పెద్దదని తెలుస్తోంది.



## భావోద్వేగాల దీక్ష

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం తథ్యమనే ఓ మంచి సందేశంతో రూపొందించిన చిత్రమే మా 'ఆర్కే దీక్ష' అన్నారు ప్రతాని రామకృష్ణగౌడ్. ఆయన దర్శకత్వంలో... ఆక్సఖాన్, అలేఖ్యరెడ్డి, కిరణ్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్‌శర్మ ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్రం మార్చి రెండో వారంలో ప్రేక్షకుల ముందుకు రానుందని సినీ వర్గాలు తెలిపాయి. దర్శకనిర్మాత మాట్లాడుతూ "ప్రేమ, సందేశం, యాక్షన్, భావోద్వేగాలకు ప్రాధాన్యమున్న కథ ఇది. కథనం కొత్తగా ఉంటుంది. మధుప్రియ ఆలపించిన మూడు పాటలు, వాటిని చిత్రీకరించిన విధానం సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయ"న్నారు.

## 14న పెద్ది సెకండ్ సింగిల్ విడుదల

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' పై ప్రేక్షకుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' మ్యూజిక్ లవర్స్‌ను విపరీతంగా ఆకట్టుకుని ఆడియో ప్లాట్‌ఫామ్స్‌లో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు అందరి దృష్టి సినిమా నుంచి రాబోతున్న సెకండ్ సింగిల్ పై పడింది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం సినిమాకు మరింత ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజా సమాచారం ప్రకారం, రెండో పాట ఒక పవర్‌ఫుల్ ఇంట్రడక్షన్ సాంగ్ గా ఉండనుందని తెలుస్తోంది. రామ్ చరణ్ పాత్రను గ్రాండ్‌గా ఎలివేట్ చేసే ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అదిరిపోయే స్టెప్పులు డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సాంగ్‌లో చరణ్ మాస్ ఎనర్జీ, స్టైల్ అభిమానులను అలరిస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా స్వయంగా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఈ పాట గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఈ సాంగ్ ఖచ్చితంగా ఒక బ్లాస్ట్ లా ఉంటుంది' అంటూ అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపారు. వాస్తవానికి ఈ పాటను డిసెంబర్ చివర్లో విడుదల చేయాలనుకున్నప్పటికీ, పలు కారణాల వల్ల వాయిదా పడింది. ప్రస్తుతం ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదల చేస్తున్నట్టు సమాచారం. అధికారిక ప్రకటన ఈ వారంలో వెలువడే అవకాశముందని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. అదేవిధంగా కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు, బాలీవుడ్ నటుడు దివ్యేందు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



### అమెరికా వీసా కష్టాలతో

# గాయపడ్డ సింహం

### ట్రైజర్ విడుదలలో నటదర్శకుడు తరుణ్ భాస్కర్

నూతన తరహా సినిమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్ మరోసారి వార్తల్లో నిలిచారు. 'పెళ్లి చూపులు'తో టాలీవుడ్‌కు న్యూ ఏజ్ కథనం ఎలా ఉండాలో చూపించిన ఆయన, 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో కల్ట్ ఫాలోయింగ్ సంపాదించారు. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ వరుస చిత్రాలతో బిజీ అవుతున్న తరుణ్ భాస్కర్ ఇప్పుడు 'గాయపడ్డ సింహం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రానికి కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించగా, ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి కథానాయికలుగా నటించారు. దర్శకుడు పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరించడం విశేషం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు సంబంధించిన టీజర్, ట్రైలర్ కలిపిన 'ట్రైజర్' ను తాజాగా విడుదల చేశారు. విడుదలైన ట్రైజర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. కామెడీ, వ్యంగ్యం, యాక్షన్ అంశాలను కలగలిపి సరదాగా రూపొందించినట్లు కనిపిస్తోంది. కథాంశం విషయానికి వస్తే? అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసుకునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుంది. వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్టేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ ద్వారా అర్థమవుతోంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి. ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్




ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది. అనే క్యాప్షన్ ద్వారా చిత్ర బృందం కథలో ఉన్న అంతర్గత భావాన్ని స్పష్టంగా చెప్పింది. వేసవి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు. వినోదంతో పాటు సమాజంలోని యువత సమస్యలను టచ్ చేస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజయ్ దేవరకొండ పెళ్లిపై దర్శక, నటుడు తరుణ్ భాస్కర్ స్పందించారు. 'త్వరలో విజయ్ వివాహం అని తెలిసింది. మీరు వెళుతున్నారా?' అని అడగ్గా.. 'నాకు ఆహ్వానం అందలేదు. ఒకవేళ ఇన్విటేషన్ వస్తే మీకు వాట్సాప్‌లో ఫార్వాడ్ చేస్తా. కలిసి వెళదాం అని సమాధానమిచ్చారు. తన కొత్త సినిమా 'గాయపడ్డ సింహం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన సందడి చేశారు. ఈ నెల 26న విజయ్- రష్మికల వివాహం చేసుకోబోతున్నా రంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తరుణ్‌ను ప్రశ్నించారు. విజయ్- తరుణ్ స్నేహితులన్న సంగతి తెలిసిందే. హీరోగా మూడు ప్రాజెక్టులు అంగీకరించా. వాటిలోని 'ఓం శాంతి శాంతి శాంతిః' ఇటీవల విడుదలైంది. రెండో సినిమా గాయపడ్డ సింహం మరో సినిమా రాబోతోంది. దర్శకుడిగా ప్రస్తుతం 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ తెరకెక్కిస్తున్నా. అక్టోబరు,నవంబరులో విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఓటీటీ సంస్థ కోసం ఓ ప్రాజెక్టు చేస్తున్నా. వెంకటేశ్‌తో చేయాలనుకున్న మూవీ స్క్రిప్టు దశలో ఉంది. వేరే కథ ఒకటి రాస్తున్నా' అని తెలిపారు.



### తెలుగు రాకున్నా

# మేనేజ్ చేస్తున్నా

### 'వారణాసి' హీరోయిన్ ప్రియాంక

రాజమౌళి-మహేష్ బాబుల క్రేజీ కాంబోలో వస్తున్న 'వారణాసి' సినిమా ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది. సుమారు రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్‌లో ప్రియాంక చోప్రా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మహేష్ బాబు 'రుద్ర'గా కనిపిస్తుండగా, విలన్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. అయితే ఈ మూవీ గురించి ఎలాంటి చిన్న వార్త వచ్చిన కూడా నిమిషంలో వైరల్ అవుతుంది. ఇందులో భాగంగా తాజాగా అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన ప్రియాంక, ఈ సినిమాలో నటించడం తన కెరీర్‌లోనే ఒక విభిన్నమైన అనుభవమని పేర్కొన్నారు. ముఖ్యంగా.. తెలుగు భాష రాకపోవడం తనను ఇబ్బంది పెట్టినప్పటికీ, రాజమౌళి సహకారం తో దాన్ని అధిగమిస్తున్నట్లు తెలిపారు. ప్రియాంక చోప్రా మాట్లాడుతూ.. 'వారణాసి సినిమాలో నటించడం నాకు ఒక పెద్ద ఛాలెంజ్‌గా మారింది. నిజం చెప్పాలి అంటే నాకు తెలుగు అస్సలు రాదు, అర్థం కూడా కాదు. కేవలం డైలాగులను అక్షరాలా గుర్తుపెట్టుకుని పలుకుతున్నాను. సెట్‌లో ఒక్కసారిగా డైలాగ్స్ మారిస్తే నాకు చాలా కష్టమవుతుంది. అలాంటి సమయంలో రాజమౌళి సర్ నాకు అండగా నిలుస్తారు. ప్రతి మాట అర్థం, భావం వివరించి అది ఏ టోన్‌లో చెప్పాలో ఆయన వివరంగా చెబుతారు. కొన్నిసార్లు డైలాగ్ అర్థం చేసుకోవడానికి పది నిమిషాలు సమయం తీసుకుని, నా స్టైల్‌లో చెప్పే ప్రయత్నం చేస్తాను. ఇది నాకు ఒక అదనపు పెర్ఫార్మెన్స్ లేయర్ లాంటిది' అని వివరించారు. తన తోటి నటుడు పృథ్వీరాజ్‌కు కూడా తెలుగు రాదని, కానీ తనకంటే ఆయనే కొంచెం బెటర్ అని ప్రియాంక సరదాగా వ్యాఖ్యానించారు.



## మృణాల్ చుట్టూ పెళ్లి రూమర్లు

బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఈ మధ్య కాలంలో డేటింగ్, పెళ్లి రూమర్లతో హాట్ టాపిక్‌గా నిలుస్తున్నారు. ఈ రూమర్స్ మధ్య బాలీవుడ్ హీరో చేసిన పని హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ హీరో సిద్దాంత్ చతుర్వేది మృణాల్‌పై పూల వర్షం కురిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మృణాల్ ఠాకూర్, సిద్దాంత్ చతుర్వేది కలిసి నటించిన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఈ జంట ఒక ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ వేదిక బయట ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న మృణాల్‌పై సిద్దాంత్ గొడుగులో నింపుకుని తెచ్చిన పూలతో అకస్మాత్తుగా పూల వర్షం కురిపించాడు. దీనికి మృణాల్ ఇచ్చిన స్మైల్ రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుకుంది. అక్కడితో ఆగని సిద్దాంత్, అదే ప్రమోషనల్ ఈవెంట్ స్టేజ్‌పైనా మరోసారి మృణాల్‌పై పూలు చల్లాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో వీరిద్దరి మధ్య ఏదైనా ప్రత్యేక బంధం ఉందా అనే చర్చలు మొదలయ్యాయి.మరోవైపు మృణాల్ ఠాకూర్ తమిళ స్టార్ హీరో ధనుష్‌తో డేటింగ్‌లో ఉందనే వార్తలు కూడా కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే రూమర్లు వచ్చినప్పటికీ మృణాల్ టీమ్ వాటిని ఖండించింది.

### 11న నెట్‌ఫ్లిక్స్‌లో

## అనగనగా ఒకరాజు

నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'.. సంక్రాంతి కానుకగా.. జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయంతో పాటు కలెక్షన్స్ కూడా సాధించింది. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మించిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 11నుండి ఈ సినిమా అందుబాటులోకి రానున్నట్లు నెట్‌ఫ్లిక్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. 'రాజుగారి పెళ్లంటే ఏడు తరాలు అటు ఇటు గుర్తుండిపోవాలి' అని స్పెషల్ పోస్టర్ షేర్ చేశారు.




Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com